# గీటురాయి

సహజీవన భావనల పావురాయి

వారపత్రిక 29-1-2021 ₹ 15/-



## గణతంత్రంలో నిరసనల గళం

సమాజసేవన భావనల పావురాయి

# గీటురాయి

వారపత్రిక

## GEETURAI WEEKLY

Sandesha Bhavanam, Lakkadkot,
Chatta Bazar, Hyderabad-500 002.
Ph: 040-24564583; 24576237
Email : geeturaiweekly@gmail.com
Website: www.tiptrust.in

సంపుటి 43 సంచిక: 5 హైదరాబాద్
శుక్రవారం 29 జనవరి 2021 రూ.15-00
15 జమాదుల్ ఆఖిర్ 1442 హిజ్రీ


**తొలిగీటు**

**ఏకాంతంలో, బాహ్యంలో ఏ స్థితిలోనైనా దైవానికి భయపడాలి.**

– మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం)


**సంపాదకులు**
ఎస్.ఎమ్. మలిక్

**అసోసియేట్ ఎడిటర్**
అబ్దుల్ వాహెద్

**ఎడిటోరియల్ ఇన్‌ఛార్జి**
ముహమ్మద్ ముజాహిద్


**సబ్ ఎడిటర్**
యాఖూబ్ షరీఫ్

**గ్రాఫిక్స్**
ఎల్. లక్ష్మీనారాయణ
ముహమ్మద్ రఫీఖ్

**సర్క్యులేషన్ మేనేజర్**
అబ్దుల్ జలీల్, 9704317015

**సేల్స్ మేనేజర్**
ముహమ్మద్ యాసీన్, 9700255736

Edited, Printed & Published by S.M. Mallick on behalf of Telugu Islamic Publications, Typeset at "Geeturai Graphics", Printed at Cosmic Printers, Lakkadkot, Hyderabad-2, RNI R.No.37796/81, Postal Regn. No.HSE/422/2020-2022 Phone: 24564583. e-mail: geeturaiweekly@gmail.com

10

## వక్ఫ్ ఆస్తులను కాపాడుకుందాం

## లోపల...


| | | |
|---|---|---|
| ఆర్థికం | ...... | 05 |
| గణతంత్రంలో నిరసనల గళం | ...... | 06 |
| అరాచకం కవితలయి (కవిత) | | 09 |
| చరితార్థులు – రఫీ అహ్మద్ కిద్వాయ్ | ...... | 13 |
| విశ్వాసుల మాత సయ్యిదా ఆయిషా (ర.అ) – 31 | ...... | 14 |
| ఖుర్‌ఆన్ పుటల్లో ధీర వనితలు | ...... | 16 |
| వెలుగుబాట (తఫ్‌హీముల్ ఖుర్‌ఆన్ అనువాదం) | ...... | 18 |
| అడుగుజాడలు | ...... | 19 |
| మీకు కూతురుందా? | ...... | 20 |
| ధర్మబద్ధమైన హెచ్చరిక | ...... | 22 |
| టైమ్ మేనేజ్‌మెంట్ | ...... | 24 |
| సవాళ్ళ సుడిగుండంలో ముస్లిం సమాజం | ...... | 26 |
| దేశంలో మళ్లీ విద్వేషాగ్ని రెచ్చగొట్టే ప్రయత్నాలు? | ...... | 28 |
| ముస్లింలు సమాజానికి మార్గదర్శకులుగా నిలవాలి (రిపోర్టు) | ...... | 30 |
| సంక్షిప్త భారతం | ...... | 32 |
| సర్వత్రా | ...... | 33 |
| కరిగే మంచు కాలం | ...... | 34 |


### మార్పు ఉండొచ్చు..!




సీఎం సార్ మారొచ్చని
ఈటెల సార్ లీకులు
అయితే ఏంటంటా అని
పేల్చినాడు జోకులు !

ఏమో మరి చూడాలిక
ఏమంటారో లోకులు
ఏమన్నా అనకున్నా
అరుస్తాయి కాకులు !!

– యం.డి. ఉస్మాన్ ఖాన్

# ఉత్తరాలు

సంచిక 15-1-21 'ఆలోచన'లో అస్సాం ప్రభుత్వం తమ నిర్వహణలో ఉన్న మదర్సాలను రద్దు చేసిందని చదివి దిగ్భ్రాంతికి గురయ్యాము. మతపరమైన విద్యాబోధనకు ఒప్పుకోమని చెప్పి కేవలం మదర్సాలనే మూసివేసి సంస్కృత పాఠశాలలను కొనసాగించడం అన్యాయం. బీజేపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ముస్లిముల పట్ల వివక్షపూరిత చర్యలకు పాల్పడుతూనే ఉంది. భిన్నత్వంలో ఏకత్వమనే సంస్కృతిని ధ్వంసం చేస్తే దేశానికే ప్రమాదకరం. ముస్లిమ్ విద్యార్థులు ఒక చేత్తో ఖుర్‌ఆన్, మరో చేత్తో ల్యాప్ పట్టుకోవాలని స్పీచులిచ్చే ప్రధాని మోడీ చెప్పేదొకటి చేస్తున్నదొకటి. మతోన్మాదుల పాలన ఎలా ఉంటుందో మదర్సాలను రద్దు చేశాక స్పష్టమైంది.

**- షేక్ హసీనా, గన్నవరం**

సంచిక 15-1-21లో కోవిడ్-19 పరిణామాలను కళ్లకు కట్టారు. లాక్‌డౌన్ మిగిల్చిన విషాదాలను, కరోనా మహమ్మారి మిగిల్చిన చేదు జ్ఞాపకాలతో మనిషి గుణపాఠం నేర్చుకోవాలని చెప్పిన మాటలు ఆలోచింపజేశాయి. కరోనా మరో కోణాన్ని చక్కగా ఆవిష్కరించారు. కరోనా తరువాత జీవితం ఎలా ఉండాలో, ఎలా ఉండకూడదో నిగూఢంగా చెప్పకనే చెప్పారు. గుణపాఠాలు గ్రహిస్తేనే మంచి రోజులు, లేదంటే మరిన్ని క్లిష్ట పరిస్థితులు ఎదుర్కోక తప్పదు. అంతా మన చేతుల్లోనే ఉందన్న సూచన అందరికీ శిరోధార్యం.

**- ఖాజా అహ్మద్, కలిగిరి, నెల్లూరు**

ప్రతీవారం చరితార్థులు బాగుంటోంది. 15-1-21 సంచికలో మాలిక్ ముహమ్మద్ యూనుస్ గురించి చదివి ఎంతో స్ఫూర్తి పొందాము. కవి హృదయం ఎంత ఆర్థ్రతగా ఉంటుందో మాలిక్ ముహమ్మద్ యూనుస్ చరిత్రను చదివితే అర్థమవుతుంది. నశీర్ అహ్మద్ గారికి ధన్యవాదాలు. కుటుంబ విలువల ప్రాధాన్యతపై ప్రత్యేక సంచికను వెలువరించబోతున్నారని గతవారం పత్రికలో చదివి ఎంతో సంతోషించాము. మన కుటుంబ వ్యవస్థ మనదేశ విశిష్టత. దేశవిదేశాల్లో మన కుటుంబ విలువల గురించి గొప్పగా చెప్పుకునేవారు. కానీ ఇప్పుడు పాశ్చాత్య సంస్కృతి పుణ్యమా అని మన కుటుంబ విలువలు మసకబారుతున్నాయి. కుటుంబాల గోడలు కూలిపోతున్నాయి. లివింగ్ రిలేషన్ తదితర ధోరణులు మన కుటుంబ వ్యవస్థ మీద దాడిచేస్తున్నాయి. మన కుటుంబ విలువలను కాపాడుకోకపోతే, కుటుంబ వ్యవస్థను కాపాడుకోకపోతే మన ఉనికి ప్రశ్నార్థకంగా మారుతుంది. కుటుంబ వ్యవస్థ బలహీనమైతే మన దేశం బలహీనపడుతుంది.

**- షేక్ ఇస్లామ్, ఆరుగొలను**

సంచిక 22-1-21 ఆద్యంతం అలరించింది. వ్యాసాలన్నీ బాగున్నాయి. 'కవరు కథనం'లో రోహింగ్యాలో మయన్మార్ దాష్టీకాలు చదివి చలించిపోయాము. మయన్మార్ అకృత్యాలను మానవ హక్కుల సంఘాలు, శాంతివచనాలు వల్లించే దేశాలు ఎందుకు ఖండించడం లేదు? మయన్మార్ మిలటరీ ప్రమేయమున్న కంపెనీలతో లావాదేవీలు మానుకోవాలని ఐరాస చెప్పడం మంచి పరిణామం. హైకోర్టుల్లోకి హిందీని రానివ్వలేదు కథనం సమగ్రంగా ఉంది. హిందీని ప్రాంతీయ భాషా రాష్ట్రాలపై రుద్దాలని చూడటం కేంద్ర ప్రభుత్వ దౌర్జన్యపూరిత చర్యే అవుతుంది. పిల్లల చదువులు ప్రాంతీయ భాషల్లో ఉంటేనే వారి మనోవికాసం జరుగుతుంది. చెప్పే అంశమైనా, చదివే పాఠమైనా తొందరగా ఒంటబట్టుతుంది. నిజాం ప్రభుత్వం 80ఏళ్ల క్రితమే ఉర్దూ మీడియంలో వకీళ్లు, డాక్టర్లు, సైంటిస్టులను తయారు చేసిందని చదివి ఆశ్చర్యపోయాము. మంచి విషయాలను తెలియజేసినందుకు నూర్ బాషా రహ్మతుల్లాహ్ గారికి షుక్రియా. 'మోడల్.. రోల్ మోడల్'గా మారడం నిజంగా సాహసోపేతమైన చర్య. మోడల్ అంటే విలాసవంతమైన జీవితం, సెలబ్రిటీగా చెలామణి అవ్వచ్చు. కానీ వాటన్నింటినీ కాదని ధర్మం కోసం పరివర్తన చెందడం నిజంగా అభినందనీయం. ఎంపీజే తెలంగాణ అధ్యక్షులు ముహమ్మద్ అబ్దుల్ అజీజ్ గారి ఇంటర్వ్యూ బాగుంది. అన్యాయాలపై ఎంపీజే చేస్తున్న పోరాటాలు ఫలప్రదమవ్వాలని ఆశిస్తున్నాము. అన్నదాత గొప్పదనం గురించి ఇస్లామీయ బోధనలు బాగున్నాయి. నశీరాబేగం గారి 'అలా అడగొద్దు' వ్యాసం సోమరిపోతులకు చెంపపెట్టు. ఆలియా జమీలా గారి వ్యాసం బాగుంది. వ్యక్తిత్వ వికాస సూత్రాలు తెలుసుకున్నాము. సంకుచిత ధోరణి వదలి విశాల దృక్పథం అలవర్చుకుంటే కలిగే ప్రయోజనాలు బాగున్నాయి. సీనియర్ రచయితలతో పాటు కొత్త రచయితలు కూడా రాయడం వల్ల పత్రిక మరింత ఆకట్టుకుంటోంది. రచయితలందరికీ ధన్యవాదాలు.

**- ఇస్మాయిల్, అన్నవరం**

# ఆలోచన

## ఆర్థికం

**చివరకు** కోవిడ్ 19 మహమ్మారి నుంచి బయటపడే చిరుకాంతి కనిపిస్తోంది. వ్యాక్సిన్లు వచ్చేశాయి. కాని భారత ఆర్థిక వ్యవస్థ ఛిన్నాభిన్నమైపోయింది. 2020 సంవత్సరంలో ఆర్థికంగా దేశం చాలా దెబ్బతిందని విశ్లేషకులు అంటున్నారు. సామాజికంగా, రాజకీయంగా, ఆర్థికంగా అన్ని రంగాల్లోను కరోనా మహమ్మారి తీవ్రమైన దెబ్బతీసింది. కాని ఈ నష్టాన్ని పూడ్చేదిశగా మనం అడుగులు వేస్తున్నామా అన్నది ఆలోచించవలసిన విషయం.

ఇప్పుడు మనం ఆలోచించవలసింది ట్వంటి ట్వంటి గురించి కాదు, ట్వంటిఫిఫ్టీ గురించి. దేశాన్ని ఆర్థిక శక్తిగా మార్చడానికి దీర్ఘకాలిక ప్రణాళికలతో పని చేయవలసి ఉంది. ఇప్పుడు భారతదేశం ఆకారంలో అభివృద్ధి సాధిస్తుందని ప్రభుత్వవర్గాల నుంచి వినిపిస్తోంది. ఏప్రిల్ జూన్ త్రైమాసికంలో భారత ఆర్థిక వ్యవస్థ 23.9 శాతం దిగజారింది. కాని తర్వాతి త్రైమాసి కంలో 21.9 శాతం వృద్ధి నమోదు చేసింది. ఇది గ్రాఫులో ఇంగ్లీషు అక్షరం వి లా కనబడుతుంది. కాబట్టి మనం శర వేగంగా పుంజుకుంటున్నామని చెబుతున్నారు. కాని వాస్తవాలు అలా లేవు.

ద్రవ్యలోటు, బ్యాంకింగ్ రంగంలో సవాళ్ళు, ద్రవ్యోల్బణం, నిరుద్యోగం వగైరా సమస్యల గురించి ప్రతిసారి చర్చిస్తూనే ఉంటాం. ఈసారి వీటన్నింటికి కారణం కోవిడ్ అని చెప్పుకునే అవకాశం ఉంది. నిజానికి కోవిడ్ వల్ల ప్రపంచ ఆర్థికవ్యవస్థ ట్రిలియన్ల డాలర్లు నష్టపోయింది. ఒక్క అమెరికాకే 16 ట్రిలియన్ డాలర్ల నష్టం అంటున్నారు. కాని విచిత్రమేమిటంటే కరోనా కాలంలో కొందరి సంపద చాలా పెరిగింది. దేశంలోని ఏడుగురు బిలియనీర్ల సంపద 64 బిలియన్ డాలర్లు పెరిగిందని తెలుస్తోంది. భారతప్రభుత్వం ప్రకటించిన ప్యాకేజీల వల్ల ఖర్చు చేసింది మొత్తం కలిపినా 40 బిలియన్ డాలర్లు లేదంటున్నారు. అంటే అర్థమేమిటి, భారత ప్రభుత్వం 130 కోట్ల మంది భారత ప్రజలకు కేటాయించే మొత్తం కన్నా ఏడుగురు బిలియనీర్లు సంపాదించిన మొత్తం చాలా ఎక్కువ.

కోవిడ్ వల్ల భారతదేశానికి వాటిల్లిన నష్టం ప్రపంచంలో ఇతర దేశాల కన్నా చాలా ఎక్కువ ఉంటుందని ఆక్స్ ఫర్డ్ ఎకనమిక్స్ అంచనా. కోలుకోవడం చాలా కష్టమంటున్నారు. 2007 ఆర్థిక సంక్షోభం తర్వాత అమెరికా ఆర్థిక వ్యవస్థ కుంచించుకు పోయింది. ఆక్స్‌ఫర్డ్ ఎకనమిక్స్ ప్రకారం 2025 నాటికి కోవిడ్ దీర్ఘకాలిక ప్రభావంవల్ల మరింత తీవ్రమైన సవాళ్ళు ఎదురవు తాయి. వీటిని ఎదుర్కోడానికి మనం సిద్ధంగా ఉన్నామా? వీటిని తట్టుకోవా లంటే అనేక విషయాలపై దృష్టి ఉండాలి. వాతావరణ మార్పుల వల్ల సముద్రతీరాల్లో ఉన్న ముంబయి, చెన్నై, కోల్ కతా నగరాలు 2050 నాటికి ముంపు ప్రమాదం ఎదుర్కోవచ్చని అంటున్నారు. కాబట్టి వాతావరణ మార్పులను ఎదుర్కునే ప్రణాళికలు ఆర్థిక అభివృద్ధికి చాలా అవసరం.

అలాగే నాల్గవ పారిశ్రామిక విప్లవం అనేక దేశాలకు అనేక అవకాశాలను కల్పించింది. మనం వాటిని ఉపయోగించు కున్నామా అన్నది ఆలోచించుకోవాలి. కృత్రిమ మేథస్సు, రోబోటిక్స్, 3డి ప్రింటింగ్ వంటి రంగాల్లో మనం ఎక్కడున్నామో అంచనా వేసుకోవాలి. ఈ సాంకేతిక ప్రగతికి వాతావరణ మార్పులను అరికట్టే చర్యలకు మధ్య సంబంధం ఉంది. ఇప్పుడు ఎలక్ట్రిక్ కార్ల మార్కెటును అమెరికా, చైనా, యూరపు దేశాలు శాసిస్తున్నాయి. భారతదేశ జిడిపిలో ఉత్పాదకరంగం వాటా కేవలం 13.6 శాతం. 1968 తర్వాత ఇంత తక్కువ ఎన్నడూ లేదు. ఉత్పాదకరంగాన్ని పటిష్టపరిచే చర్యల గురించి మనం ఆలోచిస్తున్నామా?

మానవ వనరులు మరో ముఖ్యమైన విషయం. దేశంలో పోషకాహారలోపం సమస్య తీవ్రంగా ఉన్నప్పుడు ఇతరదేశాలతో అనేక విషయాల్లో పోటీపడడం సాధ్యం కాదు. దేశంలో ప్రస్తుతం ఉన్న విద్యా వైద్య వ్యవస్థలు దేశాన్ని ఉత్పాదకరంగంలో సూపర్ పవర్‌గా మార్చగలవా? ఐక్యరాజ్యసమితి మానవాభివృద్ధి సూచి కల్లో మనం చాలా వెనుకబడి ఉన్నాం. ఆర్థిక వ్యవస్థను నిలబెట్టా లంటే వీటన్నింటి గురించి ఆలోచించాలి. వాటితో పాటు, దేశ ఆర్థికవ్యవస్థకు వెన్నుదన్నుగా నిలబడిన వ్యవసాయ రంగం గురించి ఆలోచించాలి. వ్యవసాయ చట్టాలు నిజంగా రైతులకు మేలు చేస్తాయా? ఆర్థికవ్యవస్థకు బలాన్నిస్తాయా? ఎలా అన్నది ప్రభుత్వం ప్రజలకు వివరించి చెప్పగలగాలి. ✤

కవరు కథనం **అబ్దుల్ వాహెద్**



# గణతంత్రంలో నిరసనల గళం

గణతంత్ర దినోత్సవం రాబోతోంది. గణతంత్రం లేదా రిపబ్లిక్... భారతదేశం ప్రజాస్వామ్యం మాత్రమే కాదు, ఇది గణతంత్రం కూడాను. గణతంత్రం అంటే ప్రజలదే సార్వభౌమాధికారం. ఇప్పుడు ఈ అధికారాల కోసమే దేశరాజధాని శివార్లలో వేలాదిమంది రైతులు, రైతుకూలీలు పురుషులు, స్త్రీలు, దాదాపు 400 సంస్థలకు, సంఘాలకు చెందినవారు అసాధారణ రీతిలో నిరసన కార్యక్రమం నిర్వహిస్తున్నారు.

భారతరాజ్యాంగ దినోత్సవం రోజున అంటే నవంబరులో రైతులు నిరసన ధ్వజమెత్తి రాజధాని వైపు అడుగులు వేశారు. ప్రభుత్వం వారిని అడ్డుకోవాలని ప్రయత్నించింది. వాటర్ కేనన్లు, టియర్ గ్యాస్, మెటల్ బారికేడ్లు మాత్రమే కాదు, రోడ్లను తవ్వేసి అడ్డుకునే ప్రయత్నాలు చేసింది. కాని రైతులు ఆగలేదు. చివరకు నిరసన శిబిరాలు ఢిల్లీ శివార్లలో మొదలయ్యాయి. ఆ వెంటనే రైతు నిరసనలను అప్రతిష్ఠపాలు చేయడానికి ప్రయత్నాలు మొదలయ్యాయి. వారిని వేర్పాటువాదులు అన్నారు. జాతివ్యతిరేకులు అన్నారు. టెర్రరిస్టులు నిరసనల్లో చొరబడ్డారని ప్రచారం చేశారు. కాని ఈ ప్రయత్నాలన్నీ బెడిసికొట్టాయి. ఈ నిరసన వెనక్కు తగ్గేలా లేదు. ప్రభుత్వం చివరకు చర్చలకు దిగివచ్చింది. కాని చర్చలు కాలయాపన ప్రయత్నాలుగా కనిపించడం ప్రారంభమయ్యింది. మరోవైపు ప్రభుత్వ అనుకూల మీడియా సహజంగానే రైతు నిరసనలను అప్రతిష్ఠపాలు చేయడానికి పూర్తి ప్రయత్నాలు చేస్తోంది. ఈ నిరసనలో మనకు కనిపిస్తున్న ముఖ్యమైన అంశమేమిటంటే, రైతుల్లోని దృఢమైన సంకల్పం. ఇక్కడ ఆగ్రహావేశాలు కనబడడంలేదు. పోరాడ్డానికి రాలేదు... పోరాటం శత్రువుతో చేస్తాం... స్వంత

ప్రభుత్వంతో పోరాటం కాదు, మా హక్కులను కోరుతున్నా మంటున్నారు. రైతుల గౌరవమర్యాదలను కాపాడాలని కోరుతున్నారు.

వేలాదిమంది సుదీర్ఘకాలం నిరసన నిర్వహించడం సాధారణ మైన విషయం కాదు. పైగా ప్రభుత్వంలోని పెద్దలే ఈ నిరసలను అప్రతిష్ఠపాలు చేయడానికి ప్రయత్నిస్తున్నప్పుడు నిరసనలు కొనసాగడం మామూలు విషయం కాదు. ఈ నిరసన శిబిరాల్లో ఒక గణతంత్ర సంస్కృతి ఇప్పుడు మనకు కనిపిస్తుంది. నిరసనకారులను ప్రోత్సహించే సంగీత కార్య క్రమాలు, తాత్కాలిక స్కూళ్ళు, భోజనానికి లంగర్లు, జిమ్, హెయిర్ డ్రస్సర్స్ చివరకు బూట్లు పాలిష్ చేసేవారు కూడా స్వచ్ఛంద సేవలు అందిస్తున్నారు. క్రిస్టమస్, నూతన సంవ త్సరం, లోహ్రీ, మకర సంక్రాంతి పండగలు ఇక్కడే అందరూ కలిసి జరుపుకున్నారు. ఇప్పుడు రిపబ్లిక్ దినోత్సవం కూడా ఇక్కడే జరుపుకోడానికి సిద్ధపడుతున్నారు.

దాదాపు రెండు నెలలుగా ఈ నిరసనలు కొనసాగుతున్నాయి. ఇంత కాలం నిరసనలు కొనసాగించడానికి చాలా ఓర్పు కావాలి. హమారా సబ్ర్ అనే కవితలో రైతు కెంత సహన ముందో నేలకు బాగా తెలుసని రాశారు. డిసెంబర్, జనవరి మాసాల చలిని, వర్షాన్ని వాళ్ళు లెక్క చేయడం లేదు. రిపబ్లిక్ దినోత్సవం రోజున నిరసనలను కొనసాగించడం సిగ్గుచేటు అని ప్రభుత్వ వర్గాలు అంటున్నాయి. కాని రిపబ్లిక్ దినోత్సవం రోజున భారత గణతంత్రం ఎంత పటిష్టంగా ఉందో చాటి చెప్పే నిరసనలివి అంటున్నారు విశ్లేషకులు.

మోడీ ప్రభుత్వం రెండవసారి అధికారంలోకి వచ్చిన తర్వాత వరుసగా నిరసనలు జరుగుతూనే ఉన్నాయి. మొదట యూనివర్శిటీ విద్యార్థుల నిరసనలు ప్రారంభమయ్యాయి. జవహర్ లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయం విద్యార్థులు ప్రారం భించిన ఆ నిరసనలు ఫీజు పెంపును వ్యతిరేకిస్తూ మొదల య్యాయి, అనేక విశ్వవిద్యాలయాల విద్యార్థులు ఆ నిరసనల్లో పాల్గొన్నారు. ఆ తర్వాత పౌరసత్వ సవరణ చట్టం వచ్చింది. పౌరసత్వ సవరణ చట్టంపై నిరసనలు కొత్త చరిత్రను సృష్టించాయి. కాని గమనించవలసిన విషయమేమి టంటే, ఈ నిరసనల్లో మోడీ ప్రభుత్వం ఏ మాత్రం దిగి రాలేదు. చర్చలకు సిద్ధం కాలేదు. కాని రైతుల నిరసనల్లో ప్రభుత్వం దిగిరాక తప్పలేదు. చర్చలకు ఒప్పుకోవలసి వచ్చింది. కాని చర్చలు కేవలం కాలయాపనకు మాత్రమే అని రైతులు భావించే పరిస్థితి ఏర్పడింది. ప్రభుత్వం కాల యాపన చేస్తుంటే, రైతు నిరసనకారులు బీజేపీ ప్రభుత్వం కార్పోరేట్ల కొమ్ముకాస్తోందనే విషయాన్ని మరింత స్పష్టంగా ప్రజలందరికీ అర్థమయ్యేలా చేస్తున్నారు.

ప్రారంభంలో బీజేపీ ప్రభుత్వం ఇతర నిరసనల మాదిరిగానే రైతు నిరసనలను కూడా అప్రతిష్ఠపాలు చేయడానికి ప్రయ త్నించింది. రైతులను ఖలిస్తానీలని ప్రచారం చేయడం ప్రారం భమయ్యింది. కాని ప్రజలు ఈ ప్రచారాన్ని ఒప్పుకోలేదు. పైగా మరింత పెద్ద సంఖ్యలో నిరసనల్లో ప్రజలు పాల్గొనడం ప్రారంభమయ్యింది. పంజాబులో హిందువులు తమ ఓటు బ్యాంకుగా బీజేపీ భావిస్తుంది. కాని పంజాబు హిందువులు కూడా శిక్కు రైతులకు మద్దతుగా ముందుకు వచ్చారు. హర్యానా ప్రజలు లంగర్లు ఏర్పాటు చేశారు. ఉచితంగా వసతి సౌకర్యాలు కల్పించారు. వీళ్ళంతా ఖలిస్తానీలని చెప్ప గలరా అంటూ ప్రశ్నిస్తున్నారు. నవంబర్ 30వ తేదీన బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, పంజాబ్ ఇంచార్జి దుష్యంత్ కుమార్ గౌతమ్ డెహ్రాడూన్‌లో మాట్లాడుతూ ఖలిస్తాన్ జిందా బాద్, పాకిస్తాన్ జిందాబాద్ నినాదాలు రైతు నిరసనల్లో వినిపిస్తున్నాయని, జాతి వ్యతిరేక శక్తులకు మద్దతిచ్చే నినాదాలు ఇస్తున్నారని, ఈ నిరసనలు ఎవరు చేయిస్తున్నారో దీన్నిబట్టి అర్థమవుతుందని చెప్పాడు. కాని ఆ వెంటనే పంజాబుకు చెందిన బీజేపీ నేతలే ఈ ఆరోపణలను ఖండిం చారు. ఖలిస్తానీలని నిరసనలు చేస్తున్న రైతులపై ముద్ర వేయడానికి చేసిన ప్రయత్నాలు బెడిసికొట్టాయి. పైగా ఈ ప్రయత్నాల వల్ల పట్టణ మధ్యతరగతి వర్గం కూడా రైతులకు మద్దతివ్వడం ప్రారంభమయ్యింది. ఇలా ఇంతకు ముందు జరగలేదు. జాతి వ్యతిరేకశక్తులని, టుకడే గ్యాంగులని, టెర్రరిస్టులని ముద్రవేసి అప్రతిష్ఠపాలు చేసిన ప్రతిసారి బీజేపీ పైచేయి సాధించింది. కాని రైతు నిరసనల్లో ఈ ఎత్తుగడ ఫలించలేదు. పంజాబులో అయితే సినీనటులు, ఉద్యో గులు, ప్రవాస శిక్కులు అందరూ రైతు నిరసనలకు మద్దతు ప్రకటించారు. రైతు నిరసనలకు మరింత నైతిక బలం లభిం చింది.

ఈ నిరసనల్లో అగ్రభాగాన ఉంది శిక్కులే అన్నది నిజం. అయితే ఈ నిరసనలు శిక్కుల కోసమో, జాట్ల కోసమో

చేస్తున్న నిరసనలుగా కాదు భారత ఆహారభద్రతను కాపాడ్డం కోసం చేస్తున్న నిరసనలుగా ప్రజల ముందుకు రావడం గమనించదగిన విషయం. ఇవి కేవలం బడా రైతులు చేస్తున్న నిరసనలు మాత్రమే కాదు రైతు కూలీల జీవితాలకు కూడా సంబంధించిన నిరసనలనీ బలంగా చెప్పగలిగారు. బ్రిటీషు వారిపై పోరాడుతున్నప్పుడు గాంధీజీ ఉప్పు సత్యాగ్రహం చేశారు. ఉప్పును సింబాలిక్‌గా ఉపయోగించుకుని కుల మత విచక్షణ లేకుండా ప్రజలంతా ఏకమయ్యేలా చేశారు. ఇప్పుడు రైతును భారత ఆహార భద్రతకు సింబల్‌గా ఈ నిరసనలు బలంగా ముందుకు తీసుకువచ్చాయి.

నేషనలిజం, దేశభక్తి మాటలు చెప్పడం ద్వారా బీజేపీ ఇంత కాలం ప్రజలను తనవైపు తిప్పుకుంటూ వచ్చింది. కాని దేశభక్తి, నేషనలిజం కోసం మాట్లాడేవారు, భారతమాతాకు జై అని చెప్పేవారు రైతు ప్రయోజనాలకు ఎలా వ్యతిరేకంగా నిలబడతారు? బీజేపీ స్థానిక సాంస్కృతిక అంశాలను ఉప యోగించుకుంటూ భారతమాత, భారత సంస్కృతి వంటి నినాదాల ద్వారా ఒకవైపు ప్రజలను ఆకట్టుకుంటూ, మరో వైపు కార్పోరేట్లకు అనుకూలంగా వ్యవహరిస్తూ వచ్చింది. ఈ ఎత్తుగడ చాలా వరకు పనిచేసింది. దీనికి కారణం స్థానిక ప్రజల ప్రయోజనాలపై ప్రత్యక్షంగా దెబ్బ పడలేదు. కాని ఇప్పుడు అలా కాదు. వ్యవసాయ చట్టాలు స్థానిక ప్రజల ప్రయోజనాలపై వేటు వేస్తున్నాయి. కార్పోరేట్ ప్రయోజనాలు, స్థానిక ప్రజల ప్రయోజనాల మధ్య ప్రత్యక్ష ఘర్షణ వాతావరణం తలెత్తింది. ఈ పరిస్థితిలో నేషనలిజం నినాదాలతో రైతులకు వ్యతిరేకంగా ప్రజలను నిలబెట్టవచ్చని భావించిన బీజేపీ భంగపడింది. నిజానికి సైన్యంలో వెళ్ళేవారిలోను చాలా మంది రైతు కుటుంబాల నుంచి వెళ్ళినవారే. రైతు కుటుంబాలతో సంబంధంలేని వారు భారతదేశంలో ఎవరైనా ఉంటారా? రైతు నిరసనలను అప్రతిష్ఠపాలు చేయడానికి చేసిన ప్రతి ప్రయత్నం ఈ నిరసలను మరింత బలంగా మార్చింది. రాజకీయ ఖైదీలందరినీ విడుదల చేయాలని ఇప్పుడు రైతు నిరసనకారులు పిలుపునిచ్చారు. భీమా కోరేగాఁవ్ కేసులో అరెస్టు చేసిన వారితో సహా అందరినీ విడుదల చేయాలంటున్నారు.

విద్యార్థి నిరసనలు కాని, సిఏఏ నిరసనలు కాని ఇంత విస్తృత స్థాయిలో ప్రజామద్దతును పొందలేదన్నది కూడా గమనించాలి, అంతేకాదు, విద్యార్థులపై, సిఏఏ నిరసనకారులపై క్రూరంగా బలప్రయోగం చేయడానికి ప్రభుత్వం వెనుకాడ లేదు. కాని ప్రభుత్వ దౌర్జన్యాలను ఖండిస్తూ ప్రజాప్రతిస్పందనలు పెద్దగా కనిపించలేదన్నది కూడా గమనించవలసిన విషయం. కాని రైతు నిరసనల విషయంలో మాత్రం అలా జరగలేదు. రైతులపై బలప్రయోగానికి పూనుకునే ప్రయత్నాలు కూడా తీవ్రంగా ఖండించబడ్డాయి.

సిఏఏ నిరసనలు ఒక విస్తృత జాతి ప్రయోజనాల కోసం ప్రారంభమయ్యాయి. రాజ్యాంగ పరిరక్షణ, ప్రజాస్వామ్య పరిరక్షణ వంటి ఉదాత్తమైన లక్ష్యాలతో మొదలయ్యాయి. కాని ఈ నిరసనల్లో అగ్రభాగాన ముస్లిములే కనిపించారు. ముస్లిమేతర ప్రజానీకం ఈ నిరసనల పట్ల సంఘీభావం ప్రకటించినప్పటికీ చాలా తక్కువగా మాత్రమే కనిపించింది. దీనికి కారణం ముస్లిములకు వ్యతిరేకంగా దేశంలో ఒక పథకం ప్రకారం కొనసాగుతున్న ప్రాపగాండ కావచ్చు. ఫలితంగా ఉదాత్తమైన లక్ష్యంతో రాజ్యాంగ, ప్రజాస్వామ్య పరిరక్షణ లక్ష్యాలతో ప్రారంభమైన సిఏఏ నిరసనలు చివరకు ముస్లిముల నిరసనలుగా చాలా మంది భావించడం ప్రారంభమయ్యింది. అయినా ముస్లిం మహిళలు కరోనా మహమ్మారి పంజా విసిరే వరకు మొక్కవోని దీక్షతో నిరసనలు కొనసాగించి ప్రపంచ దృష్టిని ఆకర్షించారు.

ఇప్పుడు రైతు నిరసనల విషయంలోను ఒక మతం ప్రముఖంగా కనిపిస్తుందన్నది అంతే నిజం. పంజాబుకు చెందిన శిక్కు రైతులే అగ్రభాగాన ఉన్నారు. అందుకే వారిని ఖలిస్తానీలని అప్రతిష్ట పాలు చేయడానికి ప్రయత్నించారు. పైగా, పంజాబు శిక్కులు గతంలో వేర్పాటువాద జెండా ఎగరవేసిన ఉద్యమాలు ఉన్నాయి. అయినప్పటికీ రైతు నిరసనలను ఖలిస్తానీల కుట్రలుగా ముద్రవేయడం ప్రభుత్వానికి సాధ్యం కాలేదు. సిఏఏ నిరసనల విషయంలో ముస్లింల నిరసనలని ముద్రవేసినట్లు రైతు నిరసనల విషయంలో సాధ్యం కాలేదు. దీనికి కారణాలేమిటన్నది అధ్యయనం చేయాలి.

నిజానికి సిఏఏ వ్యతిరేక నిరసనలు విస్తృత ఉదాత్త లక్ష్యాలతో ప్రారంభమయ్యాయి. కాని క్రమేణా ముస్లిముల పౌరసత్వ సమస్యకు సంబంధించిన నిరసనలుగా మిగిలిపోయాయి.

రైతు నిరసనలు కేవలం రైతు హక్కులు సాధించే లక్ష్యంతో మాత్రమే ప్రారంభమయ్యాయి. కాని ఇప్పుడు విస్తృతస్థాయికి చేరుకున్నాయి. దళిత, మహిళా సంఘాలు కూడా ఇందులోకి వచ్చాయి. వామపక్షాలు కూడా వచ్చాయి. రైతు నిరసనలు విభిన్న సామాజిక, రాజకీయ సముదాయాల వరకు విస్తరించేలా కనిపిస్తోంది.

సిఏఏ నిరసనల్లో ముస్లిం మహిళలు, పిల్లలు, వృద్ధులు ముందంజలోకి వచ్చిన మాదిరిగానే, బిల్కిస్ దాది వంటి వృద్ధమహిళ సిఏఏ నిరసనల చిహ్నంగా మారినట్లే రైతు నిరసనల్లోను వృద్ధ శిక్కు రైతులు చలిలో నిరసనల్లో పాల్గొంటున్న దృశ్యాలు రైతు నిరసనలకు చిహ్నాలుగా మారాయి. రైతు నిరసనల విషయంలోను ఒక ప్రత్యేక మతం ప్రముఖంగా కనిపిస్తున్నప్పటికీ సిఏఏ నిరసనల్లో చేసినట్లు ప్రభుత్వం దేశభక్తి వర్సెస్ జాతి వ్యతిరేకులు అనే చర్చను ప్రారంభించడంలో ఎదురుదెబ్బలు తింది.

దీనికి కారణమొక్కటే. సిఏఏ నిరసనల్లో ముస్లిములు ముందంజలో కనిపించగానే సిఏఏ నిరసనల్లోని విస్తృత లక్ష్యాలు, రాజ్యాంగ పరిరక్షణ, ప్రజాస్వామ్య పరిరక్షణ అనేవి చాలా మందికి కనిపించలేదు. కాని రైతు నిరసనల్లో శిక్కులు పెద్ద సంఖ్యలో కనిపిస్తున్నప్పటికీ ఇవి రైతు ప్రయోజనాల కోసం జరుగుతున్న నిరసనలుగానే చాలా మంది గ్రహించారు. ఈ తేడాను పరిశీలిస్తే దేశంలో మతానికి సంబంధించి ఎలాంటి డిస్కోర్స్ ఇప్పుడు బలంగా ఉందో గ్రహించవచ్చు.

కరోనా తగ్గుముఖం పడుతోంది. మళ్ళీ సిఏఏ వ్యతిరేక నిరసనలు ప్రారంభమైతే అవి ఎలా ఉంటాయన్నది ఆసక్తికరమైన విషయం. రైతు ఉద్యమంలో సిఏఏ నిరసనకారులు కూడా మద్దతు ఇచ్చారు. బిల్కిస్ దాది స్వయంగా నిరసనల్లో పాల్గొనడానికి వెళ్ళారు. రైతు నిరసనలకు ముస్లిము సంస్థలు అనేకం మద్దతిచ్చాయి. లంగర్లు నిర్వహించారు. సిఏఏ నిరసనలు మళ్ళీ కొత్తగా ప్రారంభమవుతాయా? లేక రైతు నిరసనలకు కొనసాగింపు అవుతాయా? అనే చర్చ కూడా ఇప్పుడు కొత్తగా వినిపిస్తోంది. ఏది ఏమైనా భారత రాజకీయాలను, ముఖ్యంగా మైనారిటీ రాజకీయాలను రైతు నిరసనలు కొత్త మలుపు తిప్పుతాయనిపిస్తోంది. ❖

# అరాచకం కవితలయి


**ఎస్.ఎమ్. మలిక్**

సుగంధ ధారల తెరలయి
ఎదలో తూఫానులయి
కెరటాలు కవనమయి
ఉవ్వెత్తున లేచాయి
పదాలు ఎదిగాయి
సముద్రం పాలయి
అనన్య కవితలయి
నవరస తరంగాలయి
సమరస సందేశమయి
కవనసుధామయమయి
కవితలు జాలువారాయి
అమృతం త్రాపించాయి
సుందర తుంపరలయి
హిమగిరులయ్యాయి
కవితలు కొండలయి
వెండి ఏరులయ్యాయి
జగమెల్లా ఆవహించాయి
నలుదిశలా వ్యాపించాయి
సంగీత సాగర తరంగాలయి
మనోజగత్తులో మార్మోగాయి
తరులూ గిరులూ తలలూపాయి
చిరునవ్వులతో ఆహ్వానించాయి
ప్రచండ వయువుల్లా పారాయి
మనస్సులు డోలలూగాయి
మహదానందభరితమయి
ఎదలు ఆస్వాదించాయి
సందేశం స్వీకరించాయి
మొగ్గలన్నీ విరిశాయి
పువ్వులదో నవ్వాయి
పిట్టలు కిచకిచలాడాయి
చిలిపిగా అంతటా ఎగిరాయి
వసంతర్తువు రంగులు వెలిగాయి
అరాచకాలు సర్వం కవితలయ్యాయి!

ఇంటర్వ్యూ

ముహమ్మద్ ముజాహిద్

# వక్ఫ్ ఆస్తులను కాపాడుకుందాం



## మలిక్ మోతసిమ్ ఖాన్

**తెలంగాణా వక్ఫ్ బోర్డు సభ్యులు, జమాఅతె ఇస్లామీహింద్ జాతీయ కార్యదర్శి**

**తనకు సంబంధించిన ఆస్తిని సేవాభావంతో దైవానికి అంకితం చేయడాన్ని వక్ఫ్ అంటారు. దానమిచ్చిన ఆస్తిని పరిరక్షిస్తూ దానిద్వారా వచ్చే ఆదాయం భావితరాలకు అందించడమే వక్ఫ్ ఉద్దేశం.**

ఉదాహరణకు కొంతమంది తమ భవనాలను, భూమిని, స్థలాలను, ఇంకొంత మంది దుకాణ సముదాయాలను, తోటలను దైవమార్గంలో అంకితమిచ్చేస్తారు. వాటి ద్వారా వచ్చే రాబడి పేదలకు అందాలి. వక్ఫ్ చేయడమనేది ప్రవక్త ముహమ్మద్ (సఅసం) కాలం నుంచే ఉంది. ‘ఓ ప్రవక్తా! ఖైబర్ ప్రాంతంలో నా వాటాగా ఖరీదైన భూమి వచ్చింది. ఆ భూమిని ఏం చేయమంటారు?’ అని సలహా అడిగారు హజ్రత్ ఉమర్ (రజి). దానికాయన ‘ఆ భూమిని వక్ఫ్ చేయి, దానిమీద వచ్చే లాభాన్ని పేదలకు దానం చేయి’ అని అన్నారు. మరుక్షణమే హజ్రత్ ఉమర్ (రజి) ఆ భూమిని అల్లాహ్ మార్గంలో వక్ఫ్ చేశారు. దానిమీద వచ్చే రాబడితో జరిమానాలు చెల్లించి నిరుపేద బానిసలకు విముక్తి ప్రసాదించేవారు, బాటసారుల ఆకలి తీర్చేందుకు, వారికి ఆశ్రయమిచ్చేందుకు వినియోగించేవారు. ప్రవక్త కాలంలో వక్ఫ్ చేసే అలవాటు ఎక్కువగా ఉండేది. అయితే ఈ వక్ఫ్ భూమిని అమ్మే హక్కు యజమానికీ ఉండదు. ఈ ఆస్తిలో కానీ, ఆదాయంలో కానీ వారసులకూ వాటా ఉండదు. ఆనాటి సంప్రదాయంతోనే ముస్లిములు తమ ఆస్తులను అల్లాహ్ మార్గంలో వక్ఫ్ చేస్తారు. మన పూర్వీకులు వక్ఫ్ చేసిన ఆస్తులు దేశ వ్యాప్తంగా ఉన్నాయి. వాటి నిర్వహణ ప్రభుత్వం వక్ఫ్ బోర్డు ద్వారా నిర్వహిస్తోంది. మన తెలంగాణ రాష్ట్రంలోనూ 77వేల హెక్టార్ల వక్ఫ్ ఆస్తులుండేవని, కానీ ఇప్పుడు కేవలం 33వేల ఎకరాల భూములు మాత్రమే మిగిలాయని నివేదికలు చెబుతున్నాయి. మిగతా 42వేల

## వక్ఫ్ ఆస్తులపై అవగాహన కల్పిస్తూ శిక్షణ

నేషనల్ వక్ఫ్ అకాడమీ వక్ఫ్ ఆస్తులపై అవగాహన కల్పించేందుకు 'వక్ఫ్ అవేర్ నెస్ సర్టిఫికెట్ కోర్సు'ను నిర్వహించనున్నది. ఫిబ్రవరి 6నుంచి 11వరకు ఆరు రోజుల పాటు వక్ఫ్ సంబంధిత అంశాలపై అవగాహన కల్పించనున్నారు. వక్ఫ్ చట్టాలు, వక్ఫ్ ఆస్తుల రిజిస్ట్రేషన్, వక్ఫ్ నియమ నిబంధనలు, వక్ఫ్ బోర్డు ఆశయాలు, వక్ఫ్ బోర్టు కమిటీ అధికారాలు, ఆక్రమణకు గురైన వక్ఫ్ ప్రాపర్టీని రికవరీ చేసేందుకు ఎలా దరఖాస్తు చేయాలి, ఇస్లామ్‌లో వక్ఫ్ ఉద్దేశమేమిటి? అనే తదితర విషయాలపై అవగాహన కల్పిస్తారు. జకాత్ ఫౌండేషన్ ఆఫ్ ఇండియా నిర్వహణలో జరిగే ఈ శిక్షణ ఆన్‌లైన్‌లో నిర్వహిస్తారు. ఆసక్తిగలవారు ఈ క్రింది వైబ్‌సైట్లో తమ పేరును నమోదు చేసుకోవాలని వక్ఫ్ అకాడమీ సంచాలకులు ఎం.ఎస్.ఎ. చౌదరి తెలిపారు.

ఎకరాల వక్ఫ్ ల్యాండ్ ఆక్రమణలకు గురైందని ముస్లిమ్ నాయకులు అంటున్నారు. ఈ ఆస్తులను కబ్జా చేసిందెవరు? వక్ఫ్ ఆస్తుల ఆక్రమణలను అడ్డుకునేందుకు సీఎం కేసీఆర్ వక్ఫ్ బోర్డుకు జ్యుడీషియల్ అధికారాలు ఇస్తానన్న వాగ్దానం ఇప్పటికీ నెరవేరలేదని పలు ముస్లిమ్ సంఘాలు తీవ్రంగా మండిపడుతున్నాయి. కోట్లాది రూపాయల విలువ చేసే వందలాది ఎకరాల భూములు మన నేతలు దోచుకుంటున్నారు. అన్యాక్రాంతమైన వక్ఫ్ భూముల లెక్కతేల్చాలని వారు అంటున్నారు.

'ఏడేళ్లు గడిచినా ఇప్పటికీ వక్ఫ్ బోర్డుకు జ్యుడీషియల్ పవర్ హోదా దక్కలేదు. వక్ఫ్ బోర్డులో సిబ్బంది నియామకాలు జరగట్లేదు. రిటైర్డు ఉద్యోగులతో, కాంట్రాక్టు సిబ్బందితో నెట్టుకొస్తున్నారు. రోజురోజుకూ క్షీణిస్తున్న వక్ఫ్ బోర్డును కాపాడుకునేదెలా అని వక్ఫ్ బోర్డు సభ్యులు, జమాఅతె ఇస్లామీ హింద్ జాతీయ కార్యదర్శి మలిక్ మోతసిమ్ ఖాన్ ను అడిగితే పలు విషయాలు చెప్పారు.

**ప్ర: వక్ఫ్ ఆస్తుల పరిరక్షణ సమస్య ప్రధానంగా ఎక్కడ తలెత్తుతుంది? దీనికి ప్రధాన అవరోధకులెవరంటారు?**

● వక్ఫ్ ఆస్తుల పరిరక్షణలో ప్రభుత్వాలే అవరోధంగా మారాయి. ఆ తరువాత ముస్లిమ్ నాయకులు. ముస్లిముల్లో చైతన్యలేమి కూడా ఒకింత కారణం. మన పూర్వీకులు మన పురోగతికోసం వక్ఫ్ ఆస్తులను దానం చేసినట్లే, మనం కూడా మన రాబోయే జనరేషన్ కోసం ఆస్తులను దానం చేశామా అని ప్రశ్నించుకోవాలి. ప్రస్తుతం ఉన్న వక్ఫ్ ఆస్తులను అనుభవించాలనే ఆలోచిస్తున్నాము కానీ, హాస్పిటల్స్, విద్యాసంస్థలు, అనాథాశ్రమాలు కట్టించాలన్న ధ్యాస నేటి మన సొసైటీలో ఉన్న స్థితిమంతుల్లో ఏ కోశానా కానరావడం లేదు. ఎవరైనా శ్రీమంతులు ముందుకొచ్చి తమ ఆస్తుల్లో కొంత భాగం వక్ఫ్ బోర్డుకు అందించడమో లేదా స్వతహాగా ప్రజాసేవా కార్యక్రమాలు చేపడితే వక్ఫ్ ఆశయాలను పునరుజ్జీవింపచేసుకోవచ్చు.

**వక్ఫ్ ఆస్తుల పరిరక్షణకోసం ప్రభుత్వం ఏమి చేయాలి?**

● వక్ఫ్ ఆస్తులను కాపాడటం ప్రభుత్వ బాధ్యత. వక్ఫ్ భూమిని ఎవరైనా కబ్జా చేస్తే దాన్ని ఖాళీ చేయించే బాధ్యత ప్రభుత్వానిదే. రెవెన్యూ, కలెక్టర్, పోలీసు శాఖలు సమిష్టిగా ఈ పని చేయాల్సి ఉంటుంది. సర్కారు భూముల రక్షణకోసం ఏ నిబంధనలైతే ఉన్నాయో వక్ఫ్ ఆస్తులను కాపాడటానికీ అవే నిబంధనలు అమలు చేయాలి.

**వక్ఫ్ బోర్డు పాలకమండలి వక్ఫ్ ఆస్తుల పరిరక్షణలో నిర్లక్ష్యం వహిస్తుందన్న విమర్శ ఉంది?**

●వక్ఫ్ బోర్డు పాలకమండలి ఛైర్మన్‌గా, సభ్యులుగా అధికార పార్టీ నాయకులనే ఎన్నుకోవడం సహజం. ఛైర్మన్ సీట్లో ఎవరు కూర్చున్నా వక్ఫ్ ఆస్తులను కాపాడాలని, వక్ఫ్ బోర్డును అభివృద్ధి చేయాలనే పవిత్ర ఉద్దేశంతో వచ్చినప్పటికీ కొన్ని రాజకీయ ఒత్తిళ్లతో జరుగుతున్న అక్రమాలకు అడ్డుకట్ట వేయలేకపోతున్నారు. వక్ఫ్ బోర్డును స్వతంత్ర సంస్థగా ఏర్పాటు చేయాలి.

**వక్ఫ్ ఆదాయవనరులను పెంచుకునేందుకు మార్గాలేమిటి?**

●వక్ఫ్ బోర్డులో రాజకీయ పలుకుబడి కలవారే ఎక్కువగా

ఉన్నారు. చాలా రాష్ట్రాల్లో వక్ఫ్ బోర్డు పాలకమండలి కూడా లేదు. అధికారులే నిర్వహిస్తారు. తమ తమ ప్రాంతాల్లో ఉన్న వక్ఫ్ ఆస్తుల పరిరక్షణ కోసం స్థానిక ప్రజలే కమిటీగా ఏర్పడి వాటి పరిరక్షణ చూడాలి. ఈ కమిటీ వక్ఫ్ భూములు అన్యాక్రాంతం కాకుండా చూడాలి. ఎక్కడైనా కబ్జాలు జరిగినా, వక్ఫ్ డబ్బు దుర్వినియోగం అవుతుందని తెలిసినా ఉద్యమస్థాయిలో పోరాటాలకైనా వెనుకాడరాదు. కోర్టు మెట్లెక్కడానికీ సిద్ధమవ్వాలి. వక్ఫ్ బోర్డు అంటే అదో అవినీతి కూపమని, అక్కడ అన్నీ అక్రమాలేనని భావిస్తారు. అక్కడ అధికారుల్లోనూ మంచివారున్నారు. సిబ్బందిలోనూ నిజాయితీ పరులున్నారు. వారందరి సహకారంతో వక్ఫ్ ఆస్తులను కాపాడుకోవచ్చు.

**గతంలో ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఒవైసీ అసెంబ్లీలో వక్ఫ్ బోర్డు ఆక్రమణల గురించి ఓ ప్రశ్నలేవనెత్తారు. 75శాతం భూములు ఆక్రమణలకు గురయ్యాయని ఆయన అసెంబ్లీ సాక్షిగా ప్రకటించారు. వక్ఫ్ బోర్డు సభ్యుడిగా మీరిచ్చే సమాధానం?**

● ఆయన ఎంతోకాలంగా ఎమ్మెల్యేగా ఉన్నారు. ఆయన చెప్పినదాంట్లో వాస్తవం ఉండవచ్చు. ఒక ఎమ్మెల్యేగా తన అధికారం, పలుకుబడి ఉపయోగించి వక్ఫ్ దురాక్రమణలను అడ్డుకోవచ్చు. దేశవ్యాప్తంగా ఉన్న వక్ఫ్ బోర్డులతో పోల్చి చూస్తే తెలంగాణ వక్ఫ్ బోర్డు కాస్తంత మెరుగ్గానే ఉంది.

**వక్ఫ్ బోర్డు సభ్యుడిగా మీ అధికారాలేమిటి?**

●వక్ఫ్ బోర్డు సభ్యులంతా కలిసే ఛైర్మన్‌ను ఎన్నుకుంటారు. బోర్డు మెంబర్‌గా ఉన్న వారెవరైనా వక్ఫ్ బోర్డు ఛైర్మన్ పదవిని చేపట్టవచ్చు. వక్ఫ్ బోర్డు తీసుకునే నిర్ణయాలన్నీ బోర్డు కమిటీ మీటింగులోనే నిర్ణయమవుతాయి. బాధ్యతగల సభ్యుడిగా వక్ఫ్ ఆస్తుల పరిరక్షణ కోసం నా వంతు కృషిచేస్తున్నాను.

**సెంట్రల్ వక్ఫ్ కౌన్సిల్ పనితీరు ఎలా ఉంది?**

●సెంట్రల్ వక్ఫ్ కౌన్సిల్ ఉందా అనే విషయం చాలామందికి తెలియదు. వక్ఫ్ బోర్డు పనితీరును సెంట్రల్ వక్ఫ్ కౌన్సిల్ పరిశీలిస్తుంది. అయితే వక్ఫ్ బోర్డును ఏ సమస్య అయితే పట్టిపీడిస్తుందో వక్ఫ్ కౌన్సిల్‌ను అదే సమస్య వేధిస్తుంది. అక్కడ కూడా రాజకీయ ఒత్తిళ్లు, రాజకీయ ప్రాభల్యం ఎక్కువగా ఉండటం వల్ల ప్రభావవంతంగా పనిచేయడం లేదు.

**వక్ఫ్ ఆస్తులను కాపాడి, వాటిని ప్రయోజనంలోకి తీసుకువస్తే ముస్లిముల పురోగతి సాధ్యమేనా?**

●దేశవ్యాప్తంగా ఉన్న వక్ఫ్ ఆస్తులన్నింటినీ ఆదాయ మార్గాలుగా మలిస్తే ముస్లిమ్ సమాజ దిశను మార్చవచ్చు. ఎన్నో సమస్యలను పరిష్కరించవచ్చు. ముస్లిములను ఆర్థికంగా బలపర్చవచ్చు. కొన్ని వక్ఫ్ ఆస్తుల ఆదాయం కేవలం కొన్ని కుటుంబాలవారే అనుభవిస్తున్నారు. వాటి ఆదాయాలతో స్కూలు, కాలేజీలు నిర్మించి పేద ముస్లిమ్ పిల్లల చదువుల కోసం అవకాశాలు కల్పించాలి. మన పూర్వీకులు ఏ ఉద్దేశంతో ఆస్తులను అంకితం చేశారో ఆ ఉద్దేశం కోసమే వాటిని వెచ్చించాలి.

**వక్ఫ్ ఆస్తుల పరిరక్షణలో ముస్లిమ్ సంస్థల ప్రమేయమేముంది?**

●వక్ఫ్ ఆస్తులను కాపాడటమనేది ముస్లిమ్ సమాజ బాధ్యత. పెద్ద పెద్ద ధార్మిక సంస్థలుగా చెలామణిలో ఉన్న ముస్లిమ్ సంస్థలు ఈ పనికి పూనుకోవాలి. లేదంటే ముస్లిమ్ సంఘాలన్నీ కలిసి వక్ఫ్ ఆస్తుల పరిరక్షణ కమిటీగా ఏర్పడితే ఎంతో కొంత సత్ఫలితాలుంటాయి. అడపాదడపా మీటింగులు ఏర్పాటు చేసుకుని వక్ఫ్ ఆస్తులను కాపాడుకునే అజెండాతో ముందుకెళ్లాలి. కానీ కొంతమంది నాయకులు వక్ఫ్ ఆస్తులు కబ్జాలకు గురవుతున్నాయని మొసలికన్నీరు కారుస్తూ పత్రికా ప్రకటనలు గుప్పిస్తుంటారు. ఇది ప్రకటనలతో మాత్రమే పరిష్కారమయ్యే సమస్య కాదు. దీనికోసం ఉద్యమస్థాయిలో పనిచేయాలి.

**వక్ఫ్ ఆస్తుల పరిరక్షణలో జమాఅతె ఇస్లామీహింద్ చేపట్టిన ఉద్యమాలేమైనా ఉన్నాయా?**

●వక్ఫ్ ప్రాపర్టీని కాపాడుకోవాలన్న ఆవశ్యకతను జమాఅతె ఇస్లామీహింద్ గుర్తించింది. అందుకోసం మా ప్రాబల్యం ఉన్న రాష్ట్రాలకు వక్ఫ్ సెల్ ప్రారంభించాలని సూచించాము. ఇప్పటిదాకా 100మంది యాక్టివిస్టులను తయారు చేశాము. త్వరలోనే జాతీయ స్థాయిలో ఒక సదస్సు నిర్వహించి కార్యాచరణను ప్రకటిస్తాము. ఈ పనిలో మాతో కలిసివచ్చే సంస్థలను కలుపుకునిపోతాము.

**గీటురాయి పాఠకులకు మీరిచ్చే సందేశం?**

●గీటురాయి పత్రికలో వక్ఫ్ ఆస్తుల వివరాలను సూచిస్తూ సమగ్ర కథనాలు ప్రచురించండి. వక్ఫ్ బోర్డు ఉద్దేశాలు, ఆశయాల పట్ల ప్రజల్లో చైతన్యం కల్పించండి. ప్రతీ పాఠకుడూ వక్ఫ్ ఆస్తుల రక్షణ కోసం తన వంత కృషిచేయాలి.

'చరితార్థులు'

# రఫీ అహ్మద్ కిద్వాయ్

68

## (1894-1954)





✆ 9440241727

బ్రిటిష్ పాలనను, దోపిడీని ఎదిరించిన భారతీయుల చరిత్రలో ప్రజల సమైక్యతే ప్రత్యేక లక్షణమని నిరూపించడం ధ్యేయంగా భారత స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్న ముస్లిం అమర వీరుల గురించి చరిత్ర కారుడు, బహుగ్రంథ కర్త **సయ్యిద్ నశీర్ అహమ్మద్** రూపొందించిన ఆల్బమ్ 'చరితార్థులు' (తెలుగు) 'ది ఇమ్మోర్టల్స్' (ఇంగ్లీషు) నుండి గీటురాయి పాఠకుల కోసం ప్రత్యేకం

**భారత ప్రధానిగా** పండిట్ నెహ్రూ తరువాత ఎవరు? అన్న ప్రశ్నకు సమాధానంగా నిలచిన రఫీ అహ్మద్ కిద్వాయ్ ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని బారాబంకీ జిల్లా మసౌలి గ్రామంలోని ఇంతియాజ్ అలీ కిద్వాయ్, రషీద్-ఉల్-నిసాలకు 1894 ఫిబ్రవరి 18న జన్మించారు. పదేండ్ల వయస్సులో తల్లిని కోల్పోయిన ఆయన పినతండ్రి ఇనాయత్ అలీ వద్దకు చేరి ఆయన నుండి బ్రిటిష్ వ్యతిరేక భావాలను పుణికి పుచ్చుకున్నారు. అలీఘర్ విశ్వవిద్యాలయం విద్యార్థిగా బ్రిటిష్ వ్యతిరేక భావాలను ప్రదర్శించి 'ప్రమాదకర వ్యక్తి'గా కిద్వాయ్ ముద్రపడ్డారు. మహాత్ముడి పిలుపు మేరకు అలీఘర్ విశ్వవిద్యాలయంలో చదువును వదలి జాతీయ కాంగ్రెస్ సభ్యత్వం స్వీకరించారు. ఖిలాఫత్- సహాయ నిరాకరణోద్యమంలో క్రియాశీలక పాత్ర వహించిన రఫీ అహ్మద్ కిద్వాయ్ బారా బంకీ జిల్లా నాయకుడయ్యారు. అప్పటి నుండి ఇటు రాష్ట్ర స్థాయి అటు జాతీయ స్థాయి రాజకీయాలలో ఆయన ప్రముఖ పాత్ర వహించారు. జమీందారి కుటుంబీ కుడైన రఫీ అహ్మద్ జమీందారీ వ్యవస్థను రద్దు చేయాలని ప్రకటించి సంచలనం సృష్టించారు. జాతీయ కాంగ్రెస్ రాజకీయ విధానాలలో మార్పును ఆశిస్తూ అసెంబ్లీ ప్రవేశాన్ని అంగీకరించి మోతీలాల్ నెహ్రూ పక్షాన నిలచి రఫీ అహ్మద్ కిద్వాయ్ 1935 నాటి ఎన్నికలలో ఘన విజయం సాధించి మంత్రి పదవిని చేపట్టారు. ఆ సందర్భంగా ప్రజల హితం ఆకాంక్షిస్తూ పలు సంస్కరణలను ప్రతిపాదించారు. 1940 అక్టోబర్‌లో ప్రారంభ మైన యుద్ధ వ్యతిరేక సత్యాగ్రహ ఉద్యమాన్ని నిర్వహించేందుకు జాతీయ కాంగ్రెస్ రాష్ట్ర శాఖ కిద్వాయ్‌కు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించారు. ఆ సందర్భంగా అరెస్టయ్యి ఆయన జైలుశిక్షను అనుభవించారు. రఫీ అహ్మద్ కిద్వాయ్ మొత్తం మీద పదేండ్లకు పైగా వివిధ ప్రాంతాలలో జైలు శిక్షలను అనుభవించారు. క్విట్ ఇండియా ఉద్యమం తరువాత జరిగిన ఎన్నికల సందర్భంగా నాయకులంతా జైళ్ళల్లో ఉండటంతో బ్రిటిష్ ప్రభుత్వ సహకారంతో బలపడిన ముస్లింలీగ్‌ను ఎదుర్కొనేందుకు ఆయన చాలా శ్రమించారు. ముస్లిం లీగ్ వేర్పాటు వాద రాజకీయాలను వమ్ము చేసేందుకు 'ఖౌమీ ఆవాజ్' పత్రికను ప్రారంభించారు. లౌకిక, ప్రజాస్వామ్య భావనలను స్పష్టం చేస్తూ 'నేషనల్ హెరాల్డ్' లాంటి పత్రికలకు ఆయన పలు వ్యాసాలు రాశారు. భారత జాతి ఉమ్మడి సంస్కృతి, సభ్యతల పట్ల అపార గౌరవం గల జాతీయవాదిగా ఆ సభ్యతా-సంస్కారాల పరిరక్షణకు నిరంతరం కృషి సాగించారు. భారత విభజనను వ్యతిరేకించారు. విభజన అంటే సుసంపన్నమైన ఉమ్మడి సభ్యతా సంస్కారాల విభజనగా ఆయన ప్రకటించారు. 1947 తరువాత పండిట్ నెహ్రూ మంత్రివర్గంలో పలు పదవులు చేపట్టారు. ఆ తరువాత అటు ప్రభుత్వంలోనూ, ఇటు ప్రజా సంఘాలలోనూ పలు ప్రధాన పాత్రలను సమర్థవంతంగా నిర్వహించిన కిద్వాయ్ ప్రజల ప్రశంసలను అందుకుంటూ దేశసేవ-ప్రజాసేవలో చివరి వరకు గడిపారు. 1954 అక్టోబర్ 24న ఢిల్లీలో జరిగిన సభలో ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తూ గుండెనొప్పితో సభావేదిక మీదనే కుప్పకూలిన రఫీ అహ్మద్ కిద్వాయ్ కన్నుమూశారు. ✤

31

# విశ్వాసుల మాత
# సయ్యిదా ఆయిషా رضي الله عنها

ఉర్దూ మూలం : అల్లామా సయ్యిద్ సులైమాన్ నద్వి (రహ్మా) | తెలుగు రూపం : ముహమ్మద్ అజీజుర్రహ్మాన్

**మహాప్రవక్త ముహమ్మద్(సఅసం)** మరణానికి ముందు మహనీయ అలీ(రజి)ని ఖిలాఫత్ కొరకు ఎన్నుకోమని మరణ శాసనం చేసినట్లుగా సబాయీలు చేస్తున్న ప్రచారాన్ని సయ్యిదా ఆయిషా(ర.అ) నిర్ద్వంద్వంగా ఖండించారు. ఆమె ఇలా అన్నారు: "ఆయన(సఅసం) నా గుండెలపైనే తల ఉంచి తనువు చాలించారు. మరలాంటప్పుడు ఆయన(స) ఎప్పుడు వసీయతు చేసినట్టు?" *(సహీహ్ బుఖారీ- వీలునామా ప్రకరణం, హ.నెం.2741; సహీహ్ ముస్లిం- వీలునామా ప్రకరణం, హ.నెం.1636).* అయినా ఇది పరస్పర వైమనస్యానికి ఆధారభూతం కాజాలదు. ఇది ఒక సంఘటనకు సంబంధించిన స్టేట్‌మెంట్ మాత్రమే. ఒక వ్యక్తి అమ్మ ఆయిషా (ర.అ)తో, ఈ క్రింది దివ్య వచనానికి అర్థమేమిటో చెప్పమని కోరాడు.

**"తరువాత మేము మా దాసులలో నుండి మేము ఎన్నుకున్న వారినే ఈ గ్రంథానికి వారసులుగా చేశాము. ఇప్పుడు వారిలో ఒకడు తన ఆత్మకు అన్యాయం చేసుకుంటున్నాడు. మరొకడు మధ్యస్థంగా ఉంటున్నాడు. ఇంకొకడు అల్లాహ్ అనుమతితో పుణ్యకార్యాలలో ముందడుగు వేస్తున్నాడు."** ***(ఫాతిర్ : 32)***

దీనికి జవాబిస్తూ, "నా ప్రియమైన కుమారుడా! ఈ ఆయత్‌లో పేర్కొనబడిన వారందరూ స్వర్గంలో ప్రవేశిస్తారు" అని చెప్పారామె. ఇది మరొక ఆయత్‌కు తఫ్సీలు వంటిది :

**"శాశ్వతంగా ఉండే స్వర్గ వనాలలోకి వారు ప్రవేశిస్తారు."** ***(అల్ రాద్- 23)***

**'సాబిఖూ ఇలల్ ఖైరాత్'** అనే వాక్యం దైవప్రవక్త(స) కాలంలో మరణించిన వారికి, దైవప్రవక్త(స) శుభవార్త వినిపించిన వారికి వర్తిస్తుంది. 'మధ్యస్థంగా ఉంటున్నాడు' అనేది జీవితాంతం ప్రవక్త(స) విధానానికి కట్టుబడి ఉన్నవారికి వర్తిస్తుంది. 'ఆత్మకు అన్యాయం చేసుకున్నవార'ంటావా? వారు నా లాంటి వారు, నీలాంటి వారు *(ముస్నద్ తియాలిసీ- 3703, ముస్తద్రక్ హాకిమ్- 2/426).*

ఆ యుద్ధంలో (జమల్ యుద్ధంలో) మహనీయ అలీ(రజి)కి చేదోడువాదోడుగా ఉండి, కీలకపాత్ర పోషించిన అమ్మార్ బిన్ యాసిర్(రజి), అష్తర్ నఖ్‌యీ- ఇద్దరూ సయ్యిదా ఆయిషా(ర.అ)ను కలుసుకోవడానికి వచ్చారు.

'ఓ నా తల్లీ!' అని అమ్మార్ బిన్ యాసిర్(రజి) సంబోధించినప్పుడు,

"నేను నీ తల్లిని కాను, పో" అన్నారామె.

'తమరు అవునన్నా, కాదన్నా నాకు తల్లే' అని విన్నవించుకున్నారాయన.

"నీ వెంట ఉన్న వారెవరు?" అని ఆమె దర్యాప్తు చేయగా,

'అష్తర్ నఖ్‌యీ' అని చెప్పారాయన.

అష్తర్ నఖ్‌యీని ఉద్దేశించి,

"నా అక్క కొడుకు (అబ్దుల్లాహ్ బిన్ జుబైర్-రజి)ని చంపేయాలని ప్రయత్నించింది నువ్వే కదూ!" అంటూ కీలెరిగి వాత పెట్టారు.

'అవన్నీ ఇప్పుడు ఎందుకులెండి. ఆయన నన్ను చంపాలనుకున్నారు. నేను ఆయన్ని చంపాలనుకున్నాను' అని సమాధానమిచ్చారు అష్తర్.

"ఒకవేళ నీవు గనక అలా చేసివుంటే నువ్వెన్నటికీ సాఫల్యం పొందలేకపోయే వాడివి" అన్నారామె. *(ముస్నద్ అహ్మద్- 6/ 205)*

ఆ తర్వాత ఇలా అన్నారు : "అమ్మార్! నీకు తెలుసా! ప్రవక్త మహనీయులు(స) ఏమన్నారో! 'ఏ విశ్వాసి రక్తం చిందించడం కూడా ధర్మసమ్మతం కాదు- మూడు కారణాల వల్ల తప్ప. అతడు ధర్మభ్రష్టుడైనప్పుడు లేదా వ్యభిచారానికి ఒడిగట్టినప్పుడు లేదా ఎవరినయినా అన్యాయంగా చంపినప్పుడు" *(ముస్నద్ తియాలిసీ- 1543)*. ఈ హదీసును ఉదహరించటం ద్వారా, జమల్ యుద్ధంలో సైనికులకు జరిగిన ప్రాణనష్టం ఆధారంగా ఆమె ఉద్దేశం రక్తపాతం సృష్టించటం కాదని రూఢీ అవుతోంది.

మహాప్రవక్త ముహమ్మద్(సఅసం) మరణానికి ముందు తీవ్ర అస్వస్థతకు గురైనప్పుడు మహనీయ అబ్బాస్(రజి), మహనీయ అలీ(రజి) సహారాగా ఉండి ఆయన్ని సయ్యిదా ఆయిషా(ర.అ) కుటీరానికి తీసుకువచ్చారు. సయ్యిదా ఆయిషా (ర.అ) ఈ వృత్తాంతాన్ని వివరిస్తున్నప్పుడు, "ఆయనకు ఒకవైపున అబ్బాస్(రజి), మరోవైపున 'మరొక వ్యక్తి' చేయూతనిచ్చి తీసుకువచ్చారు" అని చెప్పేవారు. సయ్యిదా ఆయిషా(ర.అ) అలీ (రజి)పై అక్కసుతోనే ఆయన పేరు ప్రస్తావించలేదని కొందరు అతిగా అనుమానించారు. నిజానికి జరిగిందేమిటంటే, ఒకవైపున మహనీయ అబ్బాస్(రజి) ప్రవక్త(స) చేయి పట్టుకుని ఉంటే, మరోవైపున కాసేపు మహనీయ అలీ(రజి), కాసేపు ఉసామా బిన్ జైద్(రజి) ప్రవక్త(స) చేయి పట్టుకుని తీసుకువస్తున్నారు. అందువల్ల ఆమె గారు అబ్బాస్(రజి) పేరును ప్రస్తావించారు. మరోవైపున ఎవరున్నారో ఇదమిత్థంగా తేల్చుకోలేక క్లుప్తంగా 'మరొక వ్యక్తి' అని చెప్పారు *(సహీహ్ బుఖారీ- కితాబుల్ మగాజీ, హ.నెం.4442; సహీహ్ ముస్లిం- నమాజ్ ప్రకరణం, హ.నెం.418)*.

బహిరంగంగా-ప్రజలందరి సమక్షంలో-సయ్యిదా ఆయిషా (ర.అ), మహనీయ అలీ(రజి) తమ మనసుల్లోని మాటను చెప్పుకుని నిష్కల్మషమైన హృదయంతో ఎవరి దారి వారు వెళ్ళడాన్ని బట్టి కూడా పరస్పర వైమనస్యం గురించి చెప్పుకునే మాటల్లో బలం లేదని తెలిపోతుంది. మహనీయ అలీ(రజి) గొప్పతనం గురించి సయ్యిదా ఆయిషా(ర.అ) చెప్పిన హదీసులు ఎన్నో ఉన్నాయి. ప్రవక్త మహనీయుల(స)కు అందరికన్నా ఎక్కువగా ప్రియమైన వారెవరు? అని ఒక వ్యక్తి అడగ్గా, "ఫాతిమా"అని సయ్యిదా ఆయిషా(ర.అ) చెప్పారు. పురుషులలో ప్రియతములెవరు? అని అడిగితే, "ఆమె భర్త. ఆయన అత్యధికంగా నమాజ్ చేసేవారు, అత్యధికంగా ఉపవాసాలు ఉండేవారు" అని బదులిచ్చారు. *(సుననె తిర్మిజీ- సహాబా మహిమోన్నతల ప్రకరణం, హ.నెం.3874)*.

మహనీయ అలీ (రజి) 'అహ్లె బైత్' (ప్రవక్త కుటుంబీకుల్లోని వారు) అన్న విషయం మనకు తెలిసింది కూడా అమ్మ ఆయిషా(ర.అ) ద్వారానే *(సహీహ్ ముస్లిం- బాబు ఫజాయెలు అహ్లె బైతున్నబీ- సఅసం, హ.నెం.2424)*. పలుమార్లు ప్రముఖులు ఆమె వద్దకు సలహా కోసం వచ్చినప్పుడు, మహనీయ అలీ(రజి)ని సంప్రతించండి" అంటూ, వారిని ఆయన దగ్గరకు పంపించేవారు. ఆయన ఎప్పుడయినా ప్రయాణం నుండి తిరిగి వచ్చినప్పుడు, గౌరవార్థం తన అల్లుణ్ణి విందు భోజనానికి ఆహ్వానించే వారు *(ముస్నద్ అహ్మద్- 6/ 155)*.

మహనీయ అలీ(రజి) కూఫా నగరంలో 'ఖారిజీల' చేతుల్లో వీర మరణం పొందినప్పుడు, అక్కడి ప్రజలు వచ్చి, జరిగినదంతా ఆమెకు విడమరచి చెప్పారు. అప్పుడు సయ్యిదా ఆయిషా(ర.అ) ఒక వ్యక్తితో, "అబ్దుల్లాహ్! నేనొక విషయం అడుగుతాను, నిజం చెబుతావా?" అని అడిగారు. 'ఎందుకు చెప్పను? తప్పకుండా ఉన్నదున్నట్లు చెబుతాన'ని అతనన్నాడు. "అలీ (రజి)ని హత్యచేసిన వారి గురించి నీకేం తెలుసు? అసలెందుకు ఇలా జరిగింది?" అని ప్రశ్నించగా, మహనీయ అలీ (రజి)- మహనీయ అమీర్ ముఆవియాల మధ్య కుదిరిన ఒడంబడిక గురించి, అందలి పరమార్థం గురించి, ఖారిజీ వర్గీయులు దానిని వ్యతిరేకించటం గురించి, ఖారిజీలు ఆయన మాటను వినకపోవటం గురించి ఆ వ్యక్తి క్షుణ్ణంగా వివరించాడు. ఇది విని, "అల్లాహ్ అలీ (రజి)పై తన కారుణ్యాన్ని కురిపించుగాక! ఆయనకు ఎప్పుడయినా, ఏదయినా విషయం నచ్చినప్పుడు 'సదఖల్లాహు వ రసూలుహు' అని ఆయన పలికేవారు. ఇరాక్ వాసులు ఆయనపై అబద్ధాన్ని ఆపాదిస్తున్నారు. ఆయనపై అబద్ధపు నిందారోపణ చేస్తున్నారు. గోరంత విషయాన్ని కొండంతగా చిత్రిస్తున్నారు" అని సయ్యిదా ఆయిషా(ర.అ) పలికారు. *(ముస్నద్ అహ్మద్-1/86, 87)* ✤



# ఖుర్‌ఆన్ పుటల్లో ధీరవనితలు



ఆలియా బిన్తె మునీర్ (షర్ఫియ)

**నిశ్చయంగా ముస్లిములూ, విశ్వాసులూ, విధేయులూ, నిజాయితీపరులూ, సహనశీలురు, అల్లాహ్ ముందు వినమ్రులయ్యేవారూ, దానధర్మాలు చేసేవారూ, ఉప వాసం ఉండే వారూ, తమ మర్మాంగాలను కాపాడుకునే వారూ, అల్లాహ్‌ను అత్యధికంగా స్మరించేవారూ, అయిన స్త్రీ పురుషుల నిమిత్తం అల్లాహ్ క్షమాభిక్షను, గొప్ప ప్రతిఫలాన్ని సిద్ధపరచి ఉంచాడు.** ***(అల్ అహ్జాబ్ : 35)***

వ్యక్తిత్వ వికాసం, ఆత్మప్రక్షాళన గురించి చెప్పిన ఖుర్‌ఆన్ వాక్యాలలో స్త్రీ, పురుషులలో ఎలాంటి వ్యత్యాసం లేదన్నది స్పష్టమవుతుంది. సందేశ ప్రచారకార్యాన్ని ఇరువురు నెరవేర్చాలన్నది ఖుర్‌ఆన్ బోధన. స్త్రీ అయినా, పురుషుడైనా తమ ఆచరణ పత్రాలు తీసుకుని ఒంటరిగా అల్లాహ్ ముందు హాజరు కావాల్సి ఉంటుంది. తానే స్వయంగా అల్లాహ్‌కు సమర్పిం చాలి. ధర్మప్రచార విషయంలో పురుషునిపై ఏ విధమైన బాధ్యత మోపబడిందో స్త్రీ పై కూడా అదే విధమైన బాధ్యత మోపబడింది. పిల్లలకు జన్మనివ్వడం, వారిని పెంచి పోషిం చడం, శిక్షణా సంస్కారాలు నేర్పడం వీటన్నింటిలో మగాళ్ల కంటే స్త్రీల శారీరక శ్రమే అధికంగా ఉంటుంది. కాబట్టే వారిని సంపాదన బాధ్యత నుంచి తప్పించాడు. పోషణ బాధ్యత భర్తపై మోపాడు. అయితే ధార్మిక అవశ్యకతల పరంగా చూస్తే స్త్రీ, పురుషుల మధ్య ఎటువంటి వ్యత్యాసాన్ని చూపించలేదు. ఇక మన ఇస్లామీయ చరిత్రను ఒకసారి పరిశీలిస్తే ముస్లిం మహిళల ధైర్యసాహసాలు, త్యాగాలతో చరిత్ర దర్శనమిస్తుంది.

### ఖుర్‌ఆన్ స్త్రీని ఈ ప్రపంచానికి ఎలా పరిచయం చేసిందో ఒకసారి పరిశీలిద్దాం...

హజ్రత్ మర్యమ్ (అ) ఈమె గురించి ప్రస్తావించిన విషయాలలో అతి ముఖ్యమైనది ఈమె తన శీలాన్ని ఎలా రక్షించు

కున్నారు అన్నది. స్త్రీ తన శీలాన్ని రక్షించుకోవడం అనేది ఆమె ప్రత్యేక సుగుణం. ఒకవైపు షైతాన్ మరొకవైపు షైతాను లాంటి కొందరు ఆమెపై దాడి చేయడానికి సిద్ధంగా ఉంటారు. ఏ స్త్రీ అయితే విశ్వాస బలాన్ని కలిగి ఉంటుందో ఆమెకు ఇది కష్టతరం ఎంతమాత్రం కాదు. అందుకే మానమర్యాదల సమస్యలు వస్తే హజ్రత్ మర్యమ్ (అ)ను గుర్తు చేసుకోవలసినదిగా చెప్తుంటారు.

## ధైర్యశాలి అయిన మాతృమూర్తి పరిచయం...

అత్యంత దుర్మార్గుడైన ఫిర్ఔన్ రాజు, బనీ ఇస్రాయీల్ జాతిలో జన్మించిన ప్రతి మగ పిల్లవాడిని చంపేయమని ఆజ్ఞాపించిన సమయంలో మూసా అలైహిస్సలాం జన్మించారు. మరి ఆ సందర్భంలో అల్లాహ్ సంకేతానుసారం ముక్కుపచ్చలారని పసివాడ్ని ఒక పెట్టెలో పెట్టి కాలువలో విడిచి పెట్టడానికి ఎంతటి గుండెనిబ్బరం కావాలో ఆలోచించండి. ఆ కార్యాన్ని పూర్తి చేసిన గొప్ప మాతృమూర్తి ఆవిడ. ఇక మరో స్త్రీ మూసా అలైహిస్సలాం వారి తోబుట్టువు. ఆమెగారు ఆ పెట్టెని కనిపెట్టుకుంటూ ఉండి అది ఫిర్ఔన్ లాంటి దుర్మార్గుడి కోట ఒడ్డుకు చేరుకున్నాక కోటలో చేరుకున్న తన తమ్ముడికి తన తల్లే పాలు త్రాపించే విధంగా వారందరినీ ఒప్పించడం అనేది అత్యంత వివేకంతో కూడుకున్న పని. ఈ మహత్తర కార్యాన్ని పూర్తి చేసింది ఆ వివేకవంతురాలు.

ధైర్యశాలి, మనోనిబ్బరం కలిగిన మరో స్త్రీమూర్తిని ఫిర్ఔన్ భార్య రూపంలో పరిచయం చేసింది ఖుర్ఆన్. ఫిర్ఔన్ అత్యంత దుర్మార్గుడని ఖుర్ఆన్ పలుచోట్ల పేర్కొంది. మరి అటువంటి ఫిర్ఔన్ భార్య అల్లాహ్‌పై విశ్వాసాన్ని ప్రకటించడమంటే ప్రాణాలమీదకు తెచ్చుకోవడమే. ఆమె ధైర్యసాహసాలు, మనోనిబ్బరం గురించి ఎంత చెప్పుకున్నా తక్కువే. ఫిర్ఔన్ ప్రళయం వరకూ దుర్మార్గానికి ప్రతీక అయితే, అతని భార్య ఈ ప్రపంచం నశించే వరకూ దృఢవిశ్వాసానికి నిదర్శనంగా మిగిలిపోతుంది.

ప్రవక్త సల్లల్లాహు అలైహి వ సల్లం వారి కాలంలోనూ ఎందరో మహిళలు ప్రవక్త(స)కు అండగా నిలిచారు. క్లిష్ట పరిస్థితుల్లోనూ ఎన్నో కష్టాలు అనుభవించారు. త్యాగాలు చేశారు. ప్రమాదకర పరిస్థితుల్లో తమ భర్తలను, బిడ్డలను వదిలేసి కేవలం అల్లాహ్ కోసం తమ విశ్వాసబలంతో హిజ్రత్ చేసిన వీరనారీమణులు ఎందరో. యుద్ధ మైదానాలలో తమ ప్రతిభను కనబర్చిన నారీమణుల గురించి కూడా చెప్పుకోవాలి. హజ్రత్ ఉమ్మె అమ్మార (రజి) ఈ నారీమణి ఉహుద్ యుద్ధ సమయంలో పరిస్థితులు చేజారి ప్రమాదకరంగా మారినప్పుడు ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం వారిని రక్షించడంలో నిమగ్నమయ్యారు. అప్పుడు ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం వారు ఈమె గురించి ఒక మాట అన్నారు: నేను ఎడమ వైపు తిరిగినా కుడి వైపు తిరిగినా ఆమెను మాత్రమే చూశాను. ఇంకా ఇలా అన్నారు: ఉమ్మె అమ్మార నువ్వు చూపిన తెగువ ఎవరూ చూపలేదు అని మెచ్చుకున్నారు.

నేటి ముస్లిం మహిళలు తమ బలాలను గుర్తించడంలో విఫలమయ్యారు. ధర్మసంస్థాపన లాంటి మహత్తర బాధ్యత నుండి తప్పుకుని, ఇంటి కార్యకలాపాలకే పరిమితమవడం కడు విచారకరం. ఖుర్ఆన్, సున్నత్‌లలో చూపబడిన మహిళామణులను నేటి ముస్లిములు ఆదర్శంగా తీసుకుని వారి బాటను అనుసరించాలి. ధర్మసంస్థాపన లాంటి గొప్ప బాధ్యతను విస్మరించకుండా నెరవేర్చాలి. ఈ మహత్తరకార్యం గురించి స్త్రీ, పురుషులు అనే వ్యత్యాసం లేకుండా అందరూ ప్రశ్నించబడతారు. ✤



## మౌలానా ఆజాద్‌కు ఉర్దూ పట్ల ప్రేమ

బ్రిటీష్ కాలంలో ఒక వైస్రాయ్ మౌలానా అబుల్ కలామ్ ఆజాద్‌ను కలవడానికి వచ్చాడు. ఆ సమయంలో మౌలానా దగ్గర ఒక ప్రతినిధి కూర్చుని ఉన్నాడు. అతను వైస్రాయ్ చెప్పిన విషయాలను ఉర్దూలో అనువదించి మౌలానాకు చెప్పేవాడు. అలాగే మౌలానా ఉర్దూలో చెప్పే ప్రతి మాటను ఆంగ్లంలో అనువదించి వైస్రాయ్‌కు చెప్పేవాడు. అతను ఒక విషయాన్ని సరిగ్గా అనువాదం చేయలేదు. అప్పుడు మౌలానా తప్పుగా చెప్పిన విషయాన్ని సరిదిద్దుతూ అలాకాదు, ఇలా చెప్పు అని అన్నారు.

చర్చ పూర్తయిన తరువాత వైస్రాయ్ మౌలానాతో "మీకు ఆంగ్లం వచ్చినప్పటికీ ఈ ప్రతినిధిని మీ వద్ద ఎందుకు కూర్చోబెట్టుకున్నారు" అని అడిగాడు. దానికి మౌలానా: "మీరు ఐదువేల మైళ్ళ నుంచి వచ్చినప్పటికీ మీ భాషను వదిలిపెట్టలేదు. నేను ఇంట్లో కూర్చుని నా భాషను ఎలా వదలిపెట్టగలను" అన్నారు.

అపార కృపాశీలుడు పరమ కరుణామయుడు అల్లాహ్ పేరుతో ప్రారంభిస్తున్నాను.

**తఫ్హీముల్ ఖుర్ఆన్ (ఖుర్ఆన్ అవగాహనం): మౌలానా సయ్యిద్ అబుల్ ఆలా మౌదూది, తెలుగురూపం: ఎస్.ఎమ్. మలిక్**

**88 ఆయత్‌లు**

# 38. సాద్

**మక్కా అవతరణ**

25 – 26... అప్పుడు మేము అతని ఆ తప్పిదాన్ని మన్నించివేశాము, నిశ్చయంగా మా వద్ద అతనికి అతి సన్నిహిత స్థానముంది, ఇంకా ఉత్తమ అంతిమ పరిణామముంది. (మేము అతనికి చెప్పాము) దావూద్, మేము నిన్ను భువిలో ఖలీఫా చేశాము, కనుక నీవు జనుల మధ్య ధర్మంగా పరిపాలన చెయ్యి. మనోకాంక్షను అనుసరించకు, అది నిన్ను దైవమార్గం నుంచి దారి తప్పిస్తుంది. ఎవరయితే దైవమార్గం నుండి తప్పిపోతారో నిశ్చయంగా వారి కొరకు కఠినమయిన శిక్ష పొంచి ఉంది, కారణం వారు లెక్కచూపే దినాన్ని అసలే మరచిపోయారు."[28]

**(28వ పాదసూచిక గత సంచిక తరువాయి)**

అట్లుండగా మార్గస్థుడొకడు ఐశ్వర్యవంతుని యొద్దకు వచ్చెను. అతడు తన యొద్దకు వచ్చిన మార్గస్థునికి ఆయత్తము చేయుటకు తన గొర్రెలలోగాని గొడ్లలోగాని దేనిని ముట్ట నొల్లక, ఆ దరిద్రుని గొర్రెపిల్లను పట్టుకొని, తన యొద్దకు వచ్చినవానికి ఆయత్తము చేసెను. దావీదు ఈ మాట విని ఆ మనుష్యుని మీద బహుగా కోపించుకొని- యెహోవా జీవముతోడు నిశ్చయముగా ఈ కార్యము చేసిన వాడు మరణపాత్రుడు. వాడు కనికరము లేక ఈ కార్యము చేసెను గనుక ఆ గొర్రె పిల్లకు ప్రతిగా నాలుగు గొర్రెపిల్లల నియ్యవలెనని నాతానుతో అనెను. నాతాను దావీదును చూచి- ఆ మనుష్యుడవు నీవే.... హిత్తీయుడగు ఊరియాను కత్తిచేత చంపించి అతని భార్యను నీకు భార్య యగునట్లుగా నీవు పట్టుకొని యున్నావు. అమ్మోనీయుల చేత నీవతని చంపించితివి గదా. *(2. సమూయేలు: 12:1-9)*

ఈ గాథ, ప్రసిద్ధత కారణంగా దివ్య ఖుర్ఆన్‌లో దానికి సంబంధించిన సవివరమయిన ప్రస్తావన అవసరం లేకపోయింది. పవిత్ర గ్రంథంలో ఇలాంటి విషయాలు విడమర్చి వివరించడం అల్లాహ్ పద్ధతి కూడా కాదు. అందువల్ల ఇక్కడ చాటుమాటుగానే దానిపట్ల సూచన చేయడమూ జరిగింది. దానితో పాటు అసలు ఉదంతం ఏమిటో కూడా తెలిపి గ్రంథవహులు దాన్ని ఏ విధంగా మలిచారో కూడా తెలుపడం జరిగింది. దివ్య ఖుర్ఆన్‌లో ప్రస్తావిత వివరాల వల్ల తెలిసే అసలు గాథ ఏమిటంటే, హజ్రత్ దావూద్ (అ) ఊరియా (లేదా ఆ వ్యక్తి పేరు మరేదయినా)ని, తన భార్యకు విడాకులు ఇవ్వవలసిందని కేవలం కోరి ఉంటారు. ఈ కోరిక ఒక సాధారణ వ్యక్తి ద్వారా కాక ఒక మహోన్నతుడయిన పరిపాలకుడు, బలవత్తరమయిన ధార్మిక మహత్తుగల వ్యక్తిత్వం ద్వారా ఒక సాధారణ పౌరుని సమక్షంలో వ్యక్తమవడం చేత, ఆ వ్యక్తి ఎటువంటి బలాత్కారం లేకుండా కూడా దాన్ని స్వీకరించడం తప్పదన్నట్టు అనుకోసాగాడు. ఆ సందర్భంలో అతను హజ్రత్ దావూద్ కోరికను మన్నించకముందే జాతిలోని ఇద్దరు సజ్జనులయినవారు హజ్రత్ దావూద్ వద్దకు చేరుకున్నారు. వారు ఒక కాల్పనిక వ్యాజ్యం రూపంలో ఈ వ్యవహారాన్ని ఆయన ముందుంచారు. హజ్రత్ దావూద్ ప్రారంభంలోనయితే అది నిజంగానే ఒక వ్యాజ్యమని అనుకున్నారు. తదనుగుణంగా ఆయన దాన్ని విని దానికి తన తీర్పు ఏదో వినిపించారు. కాని తీర్పు నోటి నుండి వెలువడగానే ఆయన అంతరాత్మ ఆయన్ని హెచ్చరించింది. ఈ వ్యాజ్యపు ఉపమానం తనకూ ఆ వ్యక్తికీ మధ్యనున్న వ్యవహారానికి పూర్తిగా అతుకుతుందని బోధించింది. తాను ఏ చర్యనయితే అత్యాచారమని నిర్ణయిస్తున్నారో దాన్ని తానే ఆ వ్యక్తి విషయంలో ఆచరిస్తున్నాడని హెచ్చరిక అయింది. ఈ తలంపు మదిలో కలగగానే ఆయన సజ్దాలో పడిపోయారు, పశ్చాత్తాపంతో తౌబా చేశారు, తాను ఆ చర్యను వెనక్కి తీసుకున్నారు.

బైబిల్‌లో ఈ సంఘటనకు ఆ జుగుప్సాకరమయిన రూపం ఎలా ఏర్పడింది? ఈ విషయాన్ని కాస్త యోచిస్తే అర్థం చేసుకోవచ్చు. బహుశా హజ్రత్ దావూద్ (అ)కు ఆ మహిళలోని సుగుణాలను గురించి ఎవరి ద్వారానో తెలిసి ఉంటుంది. ఆయన హృదయంలో ఓ ఆలోచన మెదిలి ఉంటుంది. ఇటువంటి ప్రతిభావతి అయిన స్త్రీ ఒక సాధారణ అధికారి భార్య కావడంకన్నా దేశానికి మహా రాణి అయినట్లయితే బావుంటుందని ఆయన తలిచి ఉంటారు.

**(28వ పాదసూచిక తరువాయి భాగం వచ్చే సంచికలో)**

అపార కరుణామయుడు, పరమ కృపాశీలుడు అల్లాహ్ పేరుతో

# సహీహ్ బుఖారీ (3వ సంపుటం)

**ఉర్దూ అనువాదం: అల్లామా వహీదుజ్జమా (ర.అలై)**

**తెలుగు అనువాదం : ముహమ్మద్ అజీజుర్రహ్మాన్**

## వాణిజ్య ప్రకరణం

**(క్రయ విక్రయాలు)**

**348)** విశ్వాసుల మాత హజ్రత్ ఆయిషా(ర.అ) తెలిపారు: "(మక్కాలో ఉండగా) ప్రవక్త మహనీయులు (స) ఉదయమో సాయంత్రమో ఏదో ఒకవేళ అబూబకర్(రజి) ఇంటికి రాని రోజులు బహు తక్కువే. మదీనాకు హిజ్రత్ చేసేందుకు ఆయన(స)కు అనుమతి లభించినప్పుడు, ఆయన (మామూలుకు విరుద్ధంగా) అకస్మాత్తుగా జుహ్ర్ సమయంలో మా ఇంటికి రావటం మమ్మల్ని కలవరానికి గురిచేసింది. ఆయన(స) రాక గురించి హజ్రత్ అబూబకర్(రజి)కు తెలియజేసినప్పుడు ఆయన సయితం కంగారు పడ్డారు.[1] 'ఈ సమయంలో దైవప్రవక్త (స) వచ్చారంటే ఏదో కొత్త సంఘటనే ఎదురై ఉంటుంది' అన్నారు. ఆయన (స) అబూబకర్ (రజి)ను సమీపించగానే, "ఇక్కడ మీ దగ్గర ఉన్నవాళ్ళను కాస్త దూరం జరగమనండి" అన్నారు. దానికి అబూబకర్(రజి), "దైవ ప్రవక్తా(స)! ఇక్కడ నా ఇద్దరు కుమార్తెలు ఆయిషా, అస్మా తప్ప ఎవరూ లేరు" అని చెప్పారు. "మీకు తెలుసా! ఇక్కడి నుంచి వలసపోయేందుకు నాకు అనుమతి లభించింది" అన్నారాయన(స). 'దైవప్రవక్తా! నేను కూడా మీతో పాటే వస్తాను' అన్నారు అబూ బకర్(రజి). "మిమ్మల్ని నా వెంట ఉంచాలన్నదే నా కోరిక కూడా" అని చెప్పారు దైవప్రవక్త(స). 'నా దగ్గర రెండు ఒంటెలున్నాయి. ఇలాంటి గడియ రావచ్చన్న ఉద్దేశంతోనే వాటిని సిద్ధంగా ఉంచాను. వాటిలో ఒక దానిని తమరు తీసుకోండి' అన్నారు అబూబకర్(రజి). "సరే. మూల్యానికి (వెలకు) బదులుగా నేను ఒక ఒంటెను తీసేసుకున్నాను" అని చెప్పారు దైవప్రవక్త(స).[2]

### అధ్యాయం : 57

**ఏ ముస్లిం కూడా తన సోదరుని వర్తక వ్యవహారంలో మధ్యలో తల దూర్చకూడదు. తన సోదరుడు ధర చెబుతున్నప్పుడు ఆ బేరాన్ని చెడగొట్ట కూడదు. అతను అనుమతి ఇస్తే లేదా వదలివేస్తే అప్పుడు పాల్గొనవచ్చు.[1]**

**349)** మహనీయ అబ్దుల్లాహ్ బిన్ ఉమర్(రజి) ఉల్లేఖనం ప్రకారం ప్రవక్త మహనీయులు (సఅసం) ఇలా ఉద్బోధించారు: "ఏ వ్యక్తి కూడా తన తోటి సోదరుని క్రయ విక్రయాలలో-మధ్యలో- తలదూర్చకూడదు."

348-1. ఎందుకంటే, సాధారణంగా దైవప్రవక్త(స) ఆ వేళ వచ్చే వారు కారు. వస్తే ఉదయమో లేక సాయంత్రమో వచ్చేవారు.

348-2. ఈ హదీసు ద్వారా రూఢీ అయిన ఒక ముఖ్య విషయ మేమిటంటే, దైవప్రవక్త(స) ఒంటెను కొనుగోలు చేసిన మీదట, దానిని అబూబకర్(రజి) వద్దనే ఉంచారు. అంటే ఏదయినా ఒక వస్తువును కొనుగోలు చేసి, అమ్మకందారుని వద్ద ఉంచటం అసమంజసం కాదన్నది ఈ అధ్యాయం ముఖ్య ఉద్దేశం.

57-1. అంటే మొదటి అమ్మకందారు అనుమతినిస్తే, 'నువ్వు కూడా నీ సరుకును కొనుగోలు దారునికి చూపెట్టుకో' అని చెబితే అప్పుడు చూపెట్టటం సబబే. అలాగే మొదటి కొనుగోలుదారుడు ఆ వస్తువును కొనకుండా వెళ్ళిపోతే, రెండవ వ్యక్తి దానిని కొనటం సమంజసమే. అన్యథా అది నిషిద్ధం. ఇద్దరు వ్యక్తుల మధ్య బేరం జరుగుతున్నప్పుడు మూడవ వ్యక్తి మధ్యలో జొరబడటం నైతికంగా సరైనది కాదు.




**- తహూరా సిద్దీఖా**

**ఆడపిల్ల పుట్టిందని ఆసుపత్రిలోనే వదిలేసిన తండ్రి**

**అమ్మాయి పుట్టిందని భార్యను వదిలేశాడు..**

**కూతురు పుట్టిందని భార్యను గెంటేశాడు**

**అమ్మాయి పుట్టిందని కోడలికి విషం ఇచ్చిన అత్త**

**ఆడపిల్ల పుట్టిందని.. నీళ్లలో యాసిడ్ కలిపి తాగించిన భర్త.**

**ఇవన్నీ రోజూ పత్రికల్లో మనం చదివే వార్తలు. ఈ వార్తలు చదివినప్పుడల్లా గుండె తరుక్కుపోతుంటుంది. ఈ సమాజం మారేదెప్పుడా అని లోలోనే రోదిస్తాను. కడుపులో ఉన్నది ఆడబిడ్డ అని తెలిస్తే.. ఈ లోకంలోకి రాకముందే ప్రాణం తీస్తున్నారు. ఆడపిల్ల పుడితే భారంగా.. బాధగా భావించే ఈ సమాజంలో ఇప్పుడు కాస్త మార్పు వచ్చిందనే చెప్పాలి. తనకు కూతురు పుట్టిందనే సంతోషాన్ని ఓ సెలూన్ నిర్వాహకుడు కాస్త వెరైటీగా చెప్పాడు. ఆ వివరాలేంటో చదవండి...**

ఇంటి అంగట్లో ఆడపిల్లలు ఆడుకుంటే ఆ ఇల్లు సంతోషాలకు నిలయమవుతుంది... ఆడబిడ్డ జననం అల్లాహ్ కారుణ్యానికి నిదర్శనం అని నమ్మితే ఇక ఆడపిల్లల పుట్టుకకు ఎలాంటి ప్రమాదమూ ఉండదు. కూతురు పుట్టుకతో తనవెంట కారుణ్యం, సంతోషం, శుభాలను తెస్తుందని నమ్మిన ఓ తండ్రి అమ్మాయి పుట్టినందుకు రెండింతల సంతోషంతో పొంగిపోయాడు. తనకు ఆడబిడ్డ పుట్టిందని, తాను నిర్వహించే సెలూన్‌లో ఆ రోజు ఉచిత సేవలు అందించాడు. ఇంకేముంది తాను నిర్వహించే మూడు సెలూన్లలో జనాలు కిక్కిరిసిపోయారు.

మధ్యప్రదేశ్ గ్వాలియర్‌కు చెందిన సల్మాన్ ఖాన్‌కు డిసెంబర్ 26న ఆడశిశువు పుట్టింది. తొలి సంతానంగా ఆడబిడ్డ పుట్టడం అదృష్టంగా భావించిన సల్మాన్ తన వీధివీధంతా మిఠాయిలు పంచి సంతోషాన్ని నలుగురితో పంచుకున్నాడు. అంతటితో ఆగలేదండోయ్, తాను నిర్వహించే తన మూడు సెలూన్ సెంటర్లలోనూ జనవరి 4న ఉచితంగా క్షవరం చేశాడు.

ఈ రోజుల్లో క్షవరం, గడ్డం అంటే ఎక్కువ మొత్తంలోనే ముట్టచెప్పుకోవాల్సి ఉంటుంది. కాస్తంత డీలక్స్ సెలూన్లలో అయితే ఎంతలేదన్నా రూ.300ల వరకూ ముట్టచెప్పుకోవాలి. ఇక ఉచితం అనేసరికి మూడు సెలూన్లలో జనాలు కిక్కిరిసిపోయారు. రోజంతా సల్మాన్ షేవింగ్, కటింగ్, మసాజ్ చేస్తూనే ఉన్నాడు. 'మా ఇంట్లో అమ్మాయి పుట్టింది. ఈ

శుభసందర్భంగా 2021, జనవరి 4న మా సెలూన్లలో ఉచితంగా క్షవరం చేయబడును' అనే బోర్డును పెట్టాడు. 'అమ్మాయి పుడితే విచారించకూడదని, రెండింతల సంతోషాన్ని వ్యక్తం చేయాలనే సందేశాన్ని' సల్మాన్ ఖాన్ ఇచ్చాడు. 'ఆడ, మగ అనే వ్యత్యాసం చూపకూడదని అంటాడు సల్మాన్. ఆడపిల్లల పెంపకం, పోషణ గురించి ముహమ్మద్ ప్రవక్త (సఅసం) బోధనలే సల్మాన్ ఖాన్‌కు స్ఫూర్తిదాయకం కాబట్టే అమ్మాయి పుట్టుక శుభంగా భావించాడు. తన సెలూన్‌కు వచ్చిన



ఎంతో మంది సల్మాన్‌కు శుభాకాంక్షలు తెలిపారు. సల్మాన్ చేసిన మంచి పనికి అభినందించారు. అమ్మాయి పుట్టుక సందర్భంగా సల్మాన్ ఇచ్చిన సందేశాన్ని సెలూన్ కస్టమర్లు మెచ్చుకుంటూ సోషల్ మీడియాలో ప్రశంసల వర్షం కురిపించారు. జాతీయ మీడియా కూడా సల్మాన్‌పై స్ఫూర్తిదాయక కథనాన్ని టెలికాస్ట్ చేసింది. ఈ నెల 24 జాతీయ బాలికా దినోత్సవం 'గర్ల్ చైల్డ్ డే' జరుపుకోబోతున్న సందర్భంగా యావద్దేశానికి సల్మాన్ గొప్పసందేశాన్ని అందించారు. ఆడపిల్లల పెంపకం, పోషణకు ప్రేరణగా నిలిచిన ఇస్లామ్ బోధనలను ఒకసారి మననం చేసుకుందాం...

ఎవరైనా ముగ్గురు, ఇద్దరు లేదా ఒక కూతురిని లేదా సోదరిని పెంచి పోషించి, మంచి విద్యాబుద్ధులు నేర్పించి తగిన వరుడికిచ్చి వివాహం జరిపిస్తే ఆ అమ్మాయి తల్లిదండ్రులకు స్వర్గ శుభవార్తనిచ్చారు ప్రవక్త (సఅసం). ఆడపిల్లల విషయంలో దైవానికి భయపడండి. వారిపట్ల వివక్ష చూపకండి. వారి పుట్టుక అవమానంగా భావించకండి అని ప్రవక్త (స) హెచ్చరించారు. ఇంటికి ఏదైనా వస్తువు తీసుకు వస్తే ముందుగా ఆడ కూతురుకి ఇవ్వాలన్నది ప్రవక్త బోధనల సారాంశం. ప్రవక్త (స) తన గారాల కుమార్తె హజ్రత్ ఫాతిమా (రజి) వచ్చినప్పుడు ఎంతో సాదరంగా ఆహ్వానించేవారు. 'ఆడపిల్లల పుట్టుకను చెడుగా భావించకండి. నేనూ ఆడపిల్లల తండ్రినే' అని అన్నారు ప్రవక్త ముహమ్మద్ (స). అమ్మాయి పుట్టుకముందు.. ''ఓ అమ్మాయీ ఈ భూమిపై అడుగుపెట్టు, నేను నీ తండ్రికి తోడ్పడతాను' అని అంటాడు అల్లాహ్.

ఆడపిల్లలు తల్లి కన్నీటిని తుడుస్తారు. తండ్రి దు:ఖంలో ఉంటే ఓదార్చుతారు. అందుకే ఆడపిల్లలు పూలకంటే సున్నితమైనవారు. అందుకే ఆ పూలను జాగ్రత్తగా కాపాడుకోండి.

## ఆందోళన కలిగిస్తున్న శిశుమరణాలు..

కానీ దేశవ్యాప్తంగా ఆడ-మగ జననాల నిష్పత్తి ఆందోళన కలిగిస్తోంది. దేశం అభివృద్ధి సాధించినా ఆడపిల్లలు లోకం కళ్లుతెరిచి చూడకముందే తల్లికడుపులోనే సమాధి అవుతున్నారన్న వార్తలు దిగ్భ్రాంతికి గురిచేస్తున్నాయి. ప్రపంచవ్యాప్తంగా 117 మిలియన్ భ్రూణహత్యలు జరిగాయని యునైటెడ్ నేషన్స్ పాపులేషన్ ఫండ్ నివేదిక తేల్చిచెప్పింది. మన దేశంలోనూ ఏటా 2 కోట్ల 70లక్షల మంది శిశువులు జన్మిస్తున్నారు. అందులో కోటి 54లక్షల మంది పుట్టకముందే చంపేయబడుతున్నారు. ఇందులో ఆడశిశువుల రేటు ఎక్కువుగా ఉండటం ఆందోళన కలిగిస్తోంది. వరకట్న వేధింపులు, హత్యలు మనదేశంలో కొత్తేమీ కాదు. వరకట్న దుర్మార్గాలు ఎంత రాసినా అంతంకావు. ✤

తెలుగు చేతిలో సత్య దీపిక
నిత్య వేదిక
గీటురాయి
వారపత్రిక

# ధర్మబద్ధమైన హెచ్చరిక!



సుమయ్యా

హెల్మెట్ లేకుండా వాహనం నడపడం నేరం. పోలీసుల కళ్లుగప్పి ట్రాఫిక్ రూల్స్ బ్రేక్ చేసినా సీసీ కెమెరాలో రికార్డవుతుంది. ఇంటికి చలానా వస్తుంది. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనం నడిపితే జైలుకే. పొగత్రాగడం కేన్సర్‌కు కారకం. మద్యం సేవించి వాహనం నడిపితే జైలుకు పంపుతారు. చట్టబద్ధమైన హెచ్చరిక; ధూమపానం, మద్యపానం క్యాన్సర్‌కు దారితీయవచ్చు. దోపిడీ, దొంగతనం, హత్య, అత్యాచారం, కిడ్నాప్ ఇవన్నీ ఘోర నేరాలు. వీటికి జైలుశిక్షతోపాటు ఒక్కోసారి కోర్టులు ఉరిశిక్ష కూడా విధిస్తాయి. అందుకే ఈ శిక్షలకు భయపడేవారెవరూ ఆ నేరాలవైపు కన్నెత్తి కూడా చూడరు. మన దేశంలో నేరాల కట్టడికి కఠినమైన చట్టాలు, శిక్షలే ఉన్నాయి. అయితే అవి ఏ మేరకు అమలవుతున్నాయో వేరే విషయం. మానవ చట్టాలలాగే కొన్ని దైవ చట్టాలు కూడా ఉన్నాయి.

మనిషిని పుట్టించిన దేవుడు కొన్ని హద్దులు నిర్దేశించాడు. ఖుర్‌ఆన్‌లో అల్లాహ్ చేసిన ఆ హెచ్చరికలేంటో ఈ వారం తెలుసుకుందాం. ఆ పాపాలకు పాల్పడితే కలిగే పర్యవసానాలు తీవ్రంగా ఉంటాయని ఖుర్‌ఆన్ హెచ్చరిస్తుంది.

1. దేవునికి సాటి కల్పించడం
2. అమాయకులను చంపడం
3. తల్లిదండ్రులను ఆదరించకపోవడం
4. అబద్ధపు సాక్ష్యాలు పలకడం
5. వడ్డీ సొమ్ము తినడం
6. అనాథల సొమ్మును కాజేయడం
7. అమాయకులపై అపనిందలు వేయడం
8. డబ్బును అక్రమమార్గాల ద్వారా సంపాదించడం
9. ఆత్మహత్యకు పాల్పడటం
10. భూకబ్జాలకు పాల్పడటం, లంచం
11. దోపిడీ, దొంగతనాలు, అశ్లీలం, వ్యభిచారం
12. మద్యం, మత్తుపదార్థాలు సేవించడం
13. అప్పుచేసి ఎగ్గొట్టడం
14. వ్యాపారంలో మోసం, అబద్ధం,
15. సరకుల్లో కల్తీకి పాల్పడటం
16. తూనికలు, కొలతల్లో మోసాలు
17. ఆస్తిపంపకంలో అన్యాయం
18. వాగ్దానభంగం, ఒప్పందాల ఉల్లంఘన
19. నోటిదురుసు, దురభిమానం
20. పేరుప్రతిష్టల కోసం పాకులాడటం

ఈ ఘోరపాపాలకు పాల్పడితే మనిషి మరణానంతర జీవితంలో కఠిన శిక్షకు గురికావాల్సి ఉంటుందన్నది అల్లాహ్ హెచ్చరిక. ప్రపంచంలో చేసే నేరాలు, ఘోరాలకు ప్రపంచ పోలీసుల, చట్టాల కళ్లుగప్పి తప్పించుకున్నా దేవుని శిక్ష నుండి తప్పించుకోలేరని ఖుర్‌ఆన్ ఘోషిస్తుంది.



# జెండావీధిలో చదువులే అజెండాగా ఆఫ్రీన్ లైబ్రరీ...

- ముజాహిద్

**హజ్ యాత్ర కోసం** పవిత్ర మక్కాకు వెళ్లిన ప్రతీ ఒక్కరూ మదీనాలోని మస్జిదె నబవీని సందర్శిస్తారు. ముహమ్మద్ ప్రవక్త (సఅసం) ఈ మస్జిదును స్వయంగా తన స్వహస్తాలతో నిర్మించారు. మక్కా నుంచి మదీనాకు వలస వెళ్లగానే మొట్టమొదట ఆయన తన సహచర మిత్రులతో కలిసి ఈ మస్జిదు నిర్మాణాన్ని చేపట్టారు. ప్రవక్త మస్జిదుగా పిలవబడే ఈ కట్టడం అప్పట్లో కేవలం నమాజు కోసమే ప్రత్యేకించబడేది కాదు. తీర్పులు చేసే న్యాయస్థానంగా, సామాజిక, రాజకీయ కేంద్రంగా, రిలీఫ్ సెంటర్‌గా, విద్యానిలయంగానూ నిలిచింది. మస్జిదులో ప్రవక్త ముహమ్మద్ (సఅసం) తమ శిష్యులకు జ్ఞానబోధ చేసేవారు. ప్రతీ ముస్లిమ్ చదువుకోవడాన్ని ధార్మికవిధిగా చేశారు. మస్జిదె నబవీ స్ఫూర్తితోనే నెల్లూరు జెండావీధిలోని మస్జిదె ఆలా ముందుకెళుతోంది. మస్జిదు కాంప్లెక్స్‌లో ఒక గదిని గ్రంథాలయం కోసం కేటాయించారు. స్థానిక జమాఅతె ఇస్లామీహింద్ కార్యకర్త అబ్దుస్సమీ లైబ్రరీ నిర్వహణ చూస్తున్నారు. తమ ప్రాంతంలోని వారందరికీ ఈ గ్రంథాలయం ద్వారా చదువు ప్రాముఖ్యతను, పుస్తక పఠనా సక్తిని తెలియజేస్తున్నారు. పిల్లల కోసం నైతిక విలువలు, కుటుంబ ప్రాముఖ్యత, సభ్యత, సంస్కారాన్ని పెంపొందించే పుస్తకాలతోపాటు పెద్దలకోసం సామాజిక చైతన్యాన్ని కలిగించే పుస్తకాలను లైబ్రరీలో అందుబాటులో ఉంచారు. లైబ్రరీ వరకూ వచ్చి చదువుకోలేనివారి ఇంటింటికీ తిరిగి పుస్తకాలు ఇస్తున్నారు. పుస్తక పఠనం వల్ల మనలో సంకుచిత భావాలు వీడి విశాల దృక్పథాన్ని అలవర్చుకోవచ్చంటారు అబ్దుస్సమి. సామాజిక జాడ్యాల వల్ల కలిగే నష్టాలను వివరించే పుస్తకాలూ లైబ్రరీలో ఉంచారు. నచ్చిన పుస్తకాలను ఇంటికి తీసుకెళ్లే సౌలభ్యమూ ఉంది. చుట్టూ పరిసర ప్రాంతాలైన కామాటి వీధి, కొరడా వీధి, అసార్ వీధి, కోటమిట్ట, మన్సూర్ నగర్, ఖుద్దూస్ నగర్, మెక్లిన్స్ రోడ్, పరమేశ్వరి నగర్ ప్రజలు దిన పత్రికలు, వార పత్రికలు చదివేందుకు అంతా వచ్చి కూర్చుంటారు. గ్రంథాలయంలో కూర్చుని తమ జ్ఞాన తృష్ణను తీర్చుకుంటున్నారు. తెలుగు, ఉర్దూ, ఇంగ్లీషు భాషల్లో పుస్తకాలు ఉండటం విశేషం. ఎంతోమంది ప్రముఖులు ఈ గ్రంథాలయాన్ని సందర్శించి మెచ్చుకున్నారని అబ్దుస్సమి సంతోషంగా చెప్పారు.

## లైబ్రరీలో అవగాహన సమావేశాలు..

చదువుల ప్రాముఖ్యతను వివరించే పలు సమావేశాలు నిర్వహించి ప్రముఖుల ద్వారా అవగాహన కల్పిస్తున్నారు. జాతీయ దినోత్సవాలు, ప్రముఖుల జయంతి సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి పిల్లల్ని ప్రోత్సహిస్తారు.

## ఇంతకీ ఈ లైబ్రరీకి ఆ పేరు ఎలా వచ్చింది..?

జెండా వీధిలోని మస్జిదె ఆలా కాంప్లెక్స్ లైబ్రరీగా ఎలా మారింది? దానికి ఆ పేరెలా వచ్చిందంటే.. అదే ప్రాంతానికి చెందిన యజ్దానీ కుమార్తె ఆఫ్రీన్ పెళ్లయిన ఏడాదికే అనారోగ్యంతో కన్నుమూసింది. తన కూతురి పేరు స్మారకార్థం ఏదైనా మంచి కార్యం చేయాలన్న సంకల్పమే ఈ ఆఫ్రీన్ లైబ్రరీ. నెలనెలా ఈ లైబ్రరీ అద్దె రూ.1200లు యజ్దానీ చెల్లిస్తున్నారు. 2008నుంచి ఆయన లైబ్రరీ అద్దె చెల్లించి విద్యాదానం చేస్తున్నారు. ఇక లైబ్రరీలో దినపత్రికలు, వారపత్రికల ఖర్చును స్థానిక యువకులంతా కలిసి చెల్లిస్తున్నారు. ఉదయం 8 గం॥ నుంచి 10-30 వరకు, సాయంత్రం 6.30-8-00 వరకూ ఈ లైబ్రరీ తెరిచి ఉంటుంది. విద్యాజ్ఞానాలను వెదజల్లుతున్న ఆఫ్రీన్ లైబ్రరీ నిర్వాహకులకు శుభాకాంక్షలు. ✤

నసీరా బేగం



# టైమ్ మేనేజ్‌మెంట్

సమయం స్నేహం లాంటిది. నిశ్శబ్దంగా ఎన్నో బహుమానాలు తనతో తీసుకువస్తుంది. దానిద్వారా లబ్ది పొందకపోతే బహుమానా లను తిరిగి తీసుకు వెళ్ళిపోతుంది. మళ్ళీ మరలి ఎన్నటికీ రాదు. డబ్బు పోగొట్టుకుంటే తిరిగి సంపాదించుకోగలం. నేర్చుకున్నది మరిచిపోతే తిరిగి పుస్తకాలను చదివి జ్ఞానాన్ని వృద్ధి చేసుకోగలం. ఆరోగ్యాన్ని కోల్పోతే వైద్యం చేయించుకుని తిరిగి పొందగలం. కాని సమయాన్ని కోల్పోతే ఎన్ని కోట్లు ఖర్చుపెట్టినా, ఎన్ని కష్టాలు పడినా తిరిగి ఒక్క క్షణాన్ని కూడా పొందలేము.

రోజూ ఒక్క గంట సమయాన్ని పొదుపు చేసుకుని మన నైపుణ్యా లను పెంచుకోవటం కోసం కృషి చేస్తే ఎంతో ఎత్తుకు చేరుకోగ లుగుతాం. ఎవరికైనా పుస్తకాల అధ్యయనం పట్ల ఇష్టం ఉంటే అతను ప్రతిరోజు ఒక్క గంట సమయం కేటాయిస్తే అతను కొన్ని సంవత్సరాలకు పెద్ద పండితుడే కాగలడు. ఈ విధంగా తనకు మెచ్చిన పనిలో తమ కాలాన్ని సద్వినియోగపరచుకుంటే ఒక్కొక్క మెట్టును ఎక్కుతూ ప్రగతిపథంలో దూసుకుపోవచ్చు.

కాని మనిషి 'రేపు' అనే పదం ద్వారా తనను తాను మోసం చేసు కుంటాడు. ప్రతి పనిని రేపు, రేపు అని వాయిదా వేస్తూ ఉండటం వల్ల ఆ రేపు ఎన్నటికీ రాదు, అతను సాధించాలను కున్నది ఎన్నటికీ జరగదు.

మనిషికి తన జీవితం పట్ల ప్రేమ ఉంటే, అతను తప్పకుండా సమయాన్ని ప్రేమించాలి. ఎందుకంటే సమయమే జీవితం. సమయాన్ని సద్వినియోగపరచుకోవటం జీవితాన్ని సద్వినియోగ పరచుకోవటమే. సమయాన్ని దుర్వినియోగ పరచుకోవటం జీవితాన్ని దుర్వినియోగ పరచుకోవటం వంటిది. సమయాన్ని కోల్పోయినవాడు స్వర్గాన్ని కూడా కోల్పోతాడు. ప్రళయదినం నాడు నరకవాసి మరొక్కసారి సమయమిచ్చి ప్రపంచంలో పంపమని కోరుతాడు. కాని అతని ఈ కోరిక నెరవేరదు.

సమయం అంటే జరుగుతూపోతూ ఉన్న గాథల ఒక సముద్రం. ఆ సముద్రం అలలలో అక్కడున్నవన్నీ కొట్టుకుపోతాయి. మళ్ళీ అక్కడకు కొన్ని వచ్చి చేరుతాయి. మళ్ళీ మళ్ళీ వచ్చే ఆ అలలలో అవి కూడా కొట్టుకుపోతాయి. అలల తాకిడికి అక్కడ ఏదీ నిలవదు. ఈ విధంగా ప్రపంచ కాలంలో గాథలన్నీ కనుమరుగై పోతాయి. కేవలం చరిత్ర రూపంలో గుర్తులు మాత్రమే మిగిలి పోతాయి.

సమయం వజ్రవైఢూర్యాల కంటే విలువైనది. వజ్ర వైఢూర్యాల విలువను ప్రతి ఒక్కరూ గ్రహిస్తారు. సమయం విలువను కేవలం వివేకవంతులే గ్రహిస్తారు. సాధారణంగా సమయాన్ని వినియో గించుకునేటప్పుడు ఎన్నో ఆటంకాలు ఎదురవుతూ ఉంటాయి.

ఏ విధంగా నీరు ప్రవహించటానికి బండరాళ్ళు అడ్డుపడతాయో. కాని నీరు బండరాళ్ళను అవి ఎంత పెద్దగా ఉన్నప్పటికీ వాటిని చూసి భయపడదు, వాదులాడదు, లెక్క చెయ్యదు. ప్రశాంతంగా తన దారిని తాను వెతుక్కుంటుంది. పెద్ద మార్గం లభిస్తే వేగం గానూ, చిన్న మార్గం లభిస్తే నెమ్మదిగానూ, ఉన్న మార్గంలోనే ఇమిడిపోతూ ప్రవహిస్తుంది. అదేవిధంగా వివేకవంతులు సమ యాన్ని వినియోగించుకునేటప్పుడు ఎదురయ్యే ఆటంకాల న్నింటినీ మెల్లగా తొలగించుకుంటూ ముందుకు సాగిపోతూ ఉంటారు. కనుకనే వారు పెద్దవారుగా, ఉన్నతులుగా, పండితు లుగా, మేథావులుగా రాణిస్తారు.

ప్రతి మనిషికి ఇరవై నాలుగు గంటలే లభిస్తాయి. కొందరు ఆ ఇరవై నాలుగు గంటలను నలభై ఎనిమిది గంటలుగా మార్చుకుని ప్రయోజనం పొందుతారు. మరికొందరు ఇరవై నాలుగు గంట లను ఇరవై నాలుగు నిముషాలుగా వృథా చేసుకుంటారు. మనకు ప్రతిరోజు ఈ రెండు రకాల మనుషులు కనబడతారు.

ఫ్రాంక్లెన్ చాలా కష్టపడేవాడు, ఎడతెగకుండా పనిచేసేవాడు. ఒక్క నిముషాన్ని కూడా వృథా చేసేవాడు కాదు. అతని దృష్టిలో ఒక్క నిముషం కూడా ఎంతో విలువైనది. అతను భోజనం చెయ్య టానికి రాత్రి పడుకోవటానికి చాలా తక్కువ సమయాన్ని కేటా యించేవాడు. అతను చిన్నప్పుడు ఒకసారి తన తండ్రితో కలసి భోజనం చేస్తూ ఉన్నాడు. తండ్రి భోజనం చెయ్యటానికి చాలా సమయం తీసుకున్నాడు. ఆ తరువాత అతను తిన్న, త్రాగిన ప్రతి ఒక్కొక్క దానిపై విడివిడిగా పేర్లు తీసుకుని శుభాలు చేకూర్చ మని ప్రార్థిస్తున్నాడు. తండ్రి ఈ విధంగా చాలా సమయం గడపటం అతనికి నచ్చలేదు. అతను తండ్రితో ఇలా అన్నాడు : మీరు విడివిడిగా అన్ని పేర్లు తీసుకోకుండా అన్నింటిపై ఒకేసారి కేవలం శుభాలు చేకూర్చమని క్లుప్తంగా ప్రార్థించవచ్చు కదా? దీని ద్వారా చాలా సమయం మిగులుతుంది అన్నాడు. కుమారుడి వివేకానికి తండ్రి ఆశ్చర్యపోయాడు.

వాషింగ్టన్ సెక్రెటరీ ఒకసారి కొన్ని నిముషాలు ఆలస్యంగా ఆఫీసుకు వచ్చాడు. ఆలస్యంగా రావటానికి కారణం అడగగా అతను నా గడియారం కొన్ని నిముషాలు నెమ్మదిగా నడుస్తోంది అని అన్నాడు. అతనితో ఆయన ఇలా అన్నాడు; నీవు నీ గడియారాన్ని మార్చుకో. లేకపోతే నేను నా సెక్రెటరీని మార్చవలసి వస్తుంది.

ఒకసారి ఒక దోషికి ఉరిశిక్ష వేయబడింది. తరువాత ప్రాణభిక్ష పెట్టబడింది. కాని ఆ ఆజ్ఞాపత్రాన్ని తీసుకుని వచ్చేవాడు ఐదు నిముషాలు ఆలస్యంగా వచ్చాడు. ఐదు నిముషాల ఆలస్యం ఒక మనిషి ప్రాణాన్ని బలి తీసుకుంది. దీనిద్వారా సమయానికి ఉన్న విలువ, సమయం ప్రకారం పనిచెయ్యకపోవటం కారణంగా కలిగే నష్టం స్పష్టంగా తెలుస్తోంది.


ఇతరులు పనిచేస్తూ ఉండగా తాను రెండు జేబుల్లో రెండు చేతులు పెట్టుకుని దర్జాగా నిలబడి సమయాన్ని వృథా చేసిన వాడు అతి త్వరలోనే ఆ రెండు చేతులు చాచి ఇతరుల ముందు దీనంగా నిలబడి ఉండవలసి వస్తుంది.

ఒక వివేకవంతుడితో ఏదైనా హితబోధ చెయ్యమని ఒకతను అడగగా అతను ఇలా అన్నాడు: తెలివిగా ఉండు. సమయాన్ని వృథా చేసే కార్యాల పట్ల ఆకర్షితుడు కాబోకు. ఏదైనా కార్యం చెయ్యవలసి వచ్చినప్పుడు వెంటనే చేసెయ్యి. పనిచేసిన తరువాత పగటి పూట విశ్రాంతి ఎంతమాత్రమూ తీసుకోకు.

సమయం ఒక మంచి పంట భూమి వంటిది. ఒకవేళ కష్టపడి దున్ని విత్తుతే మంచి పంట వస్తుంది. లేకపోతే పిచ్చి మొలకలు వస్తాయి.

కాలానికి పాదాల సవ్వడి ఉండదు. అది మెల్లగా సాగిపోతూ ఉంటుంది. సమయం అల్లాహ్ తరపు నుంచి అమానతుగా లభిస్తుంది. దాని గురించి ప్రళయదినం నాడు ప్రశ్నించటం జరుగుతుంది.

సమయాన్ని సద్వినియోగ పరచుకుంటూ తన ఆరోగ్యాన్ని కూడా జాగ్రత్తగా చేసుకోవాలి. ఎందుకంటే ఆత్మ ఒక ప్రయాణికుని లాంటిది. శరీరం స్వారీ చేసే వాహనం వంటిది. ప్రయాణీకుడు బలవంతుడు, చలాకీవాడుగా ఉన్నప్పుడు అతను స్వారీ చేసే వాహనం బలహీనంగా ఉంటే ప్రయాణం ఎలా సాగుతుంది. ❖





# సవాళ్ళ సుడిగుండంలో ముస్లిం సమాజం

- తస్నీమ్ జహాన్ ఖాన్

ప్రస్తుతం ముస్లిం సమాజమంతా అతి సున్నిత పరిస్థితులలో కొట్టుమిట్టాడుతోంది. గడ్డు పరిస్థితులను ఎదుర్కొంటోంది. ఎన్నో కష్టాలతో, సమస్యలతో సతమతమవుతుంది. ఈ పరిస్థితులు, సమస్యలు ఎంత కఠినంగా ఉన్నాయంటే వాటిని గురించి తెలుసుకుంటేనే దిగ్భ్రాంతికి గురవుతారు. ఆ సమస్యలను అధిగమించడానికి ఉమ్మత్ విశ్వాసాలకు, స్వభావానికి, ధార్మికతకు వ్యతిరేకమైన విధానాల వైపు కొందరు అడుగులు వేస్తున్నారు.

**భారతదేశంలో ఉమ్మత్ ఎదుర్కొంటున్న ముఖ్యమైన సమస్యలు :** “ఇస్లామీయ బోధనల ప్రకారం జీవితం గడపటం ఎలా?’ తమ అస్తిత్వాన్ని, ప్రత్యేకతను కాపాడుకోవడం ఎలా? తమ మౌలిక హక్కులు ఎలా రక్షించుకోవాలి? తమ వ్యక్తిగత, సామాజిక జీవితంపై ముస్లిమేతరుల ప్రభావం పడకుండా ఎలా జాగ్రత్త పడాలి? ఇక్కడి అధిక సంఖ్యాకులతో ఎలా మెలగాలి? వారితో కలసి పనిచేయడం ఎలా? ఎంతవరకు వారితో సహకరించాలి? ఈ క్రమంలో ఎదురయ్యే పరమత స్పర్థలను, ద్వేషాన్ని ఎలా తొలగించాలి? ఇక్కడి వాతావరణాన్ని తమకు అనుకూలంగా ఎలా మలచుకోవాలి? దేశ సెక్యులర్ వ్యవస్థతో తమ సంబంధాలు ఎలా ఉండాలి? ప్రస్తుత పరిస్థితులతో రాజకీయంగా ఎలాంటి ఆచరణాత్మక విజ్ఞతను చూపించాలి?

ఈ దేశంలో దాదాపుగా పదిహేను శాతం ఉన్నా కూడా ఈ ఉమ్మత్ మైనార్టీలుగానే ఉండటం ఈ సమస్యల తీవ్రతను ఇంకా పెంచుతుంది. వీరు విద్యా, అభివృద్ధిలో అందరికంటే వెనుకబడిపోయారు. ఆర్థికంగా అంతంత మాత్రంగానే ఉన్నారు. రాజకీయంగా నాయకత్వ స్థాయికి ఇంకా ఎదగనే లేదు.

ఇలాంటి విషమ పరిస్థితులలో ఈ ఉమ్మత్ ఉన్నత స్థాయికి చేరుకోగలిగే మార్గమే లేదా? అనే ప్రశ్న తలెత్తుతుంది. ఈ దుర్గతి నుండి విజయ పథంలోకి పయనించే మార్గమే లేదా? ఇది ధార్మికంగా, నైతికపరంగా మళ్ళీ ఉచ్ఛస్థాయికి రాగలదా? ఈ దేశంలో నాయకత్వ పాత్ర పోషించగలిగే వీలుందా? అనే ఈ ప్రశ్నలన్నింటికీ జవాబు ఒక్కమాటలో చెప్పాలంటే ‘ఔను! సాధ్యమే’ అని అనవచ్చు. అద్వితీయ, మహోన్నతుడైన ప్రభువు ఆదేశాలకు అనుగుణంగా జీవితం గడపడం దీనికి షరతు. అలా జీవితం గడిపితే ప్రతీ అపజయం విజయంగా, అధోగతి ఉన్నత స్థితికి, వెనుకబాటుతనం అభివృద్ధి వైపు పరుగులు తీస్తుంది. ఆ ప్రభువు నియమాలను ఎవ్వరూ మార్చలేరు. ఖుర్ఆన్‌లో ఇలా ఉంది : “బాగా తెలుసుకోండి, అల్లాహ్ భూమికి, మరణం తరువాత జీవం పోస్తాడని, మేము సూచనలను మీకు స్పష్టంగా చూపించాము, బహుశా మీరు విజ్ఞతతో వ్యవహరిస్తారని.”

(అల్ హదీద్ 57: 17)

తన నియమానుసారంగా మృతభూమికి తిరిగి ప్రాణం పోస్తాడు. రేయిని పగలుగా, పగలును రేయిగా మారుస్తాడు. ఆయన విధించిన నియమాలు, ఆయన ఆజ్ఞలు జాతులకు అభివృద్ధి బాటలు పట్టిస్తాయి. అభివృద్ధి సూత్రాలను పాటించి జాతులు తమ బలహీనతలపై పైచేయి సాధిస్తాయి. వారి సమస్యలకు పరిష్కారాలు లభిస్తాయి. వారి మార్గంలోని అడ్డంకులన్నీ ఒక్కొక్కటిగా తొలగిపోతాయి. వారు వేగంగా విజయ శిఖరాలకు చేరుకుంటారు. ఆ నియమ నిబంధనలు ఏమిటో తెలుసుకునే ప్రయత్నం చేద్దాం.

జాతుల విజయాభివృద్ధిలో వారి జీవన విధానం, వారి విశ్వాసం ప్రధాన పాత్ర పోషిస్తాయి. ఏ జాతికైతే తమ విశ్వాసాలపై పూర్తి నమ్మకముంటుందో, వాటి ఆధారంగానే జీవన విధానాన్ని నిర్మించుకోవాలనే నిర్ణయం గట్టిగా తీసుకుంటుందో, దాని కోసం ఎలాంటి త్యాగానికైనా సిద్ధపడిపోతుందో దాన్ని ఎవ్వరూ ఆపలేరు. విశ్వాసం ఎంత దృఢంగా ఉంటే అంత వేగంగా అభివృద్ధి సాధించ వచ్చు. ఏ జాతికైతే తమ విశ్వాసాలపై నమ్మకం సమసిపోతుందో, దాని తిరోగమనం మొదలై అధోగతి పాలు అయిపోతుంది. ఈ నియమం విశ్వాసులకూ, అవిశ్వాసులకూ వర్తిస్తుంది. రెండింటికీ భేదం ఏమిటంటే, విశ్వాసుల పురోగమనం మానవుల శ్రేయస్సుకై జరుగుతుంది.

1. ఇస్లాం ఈ ఉమ్మత్‌కు బహుదైవారాధన, మిథ్యా దైవారాధనల నుండి స్వచ్ఛపరిచి కేవలం ఏకదైవారాధన అనే విశ్వాసాన్నిచ్చింది. ఇదే దీనికి బలాన్నిచ్చే ఆయుధం. దీంతోనే ధైర్యం, అల్లాహ్‌పై నమ్మకం, స్థిరత్వం, పట్టుదల, విశాల దృక్పథం, ప్రమాదాలను ఎదుర్కొనే స్థైర్యం, వివేచన, బుద్ధికుశలతలతో పరిస్థితులతో పోరాడే శక్తి లభిస్తుంది. ఈ విశ్వాసం ఉమ్మత్‌లో సజీవంగా, చలనాత్మకంగా ఉంటే భయం, బలహీనత, అసహాయతలకు బదులుగా అనుకూలత ఏర్పడుతుంది. అది తన మార్గాన్ని తానే నిర్ణయించుకుంటుంది. దానికి ఇతరుల మార్గదర్శకత్వం అవసరమే ఉండదు. కేవలం అల్లాహ్ బలంపైనే దానికి భరోసా ఉంటుంది. ఇతరుల బలాన్నిచూసి భయపడదు. అది కేవలం ఏకైక ఆ దైవం తప్ప ఎవ్వరూ లాభంగానీ, నష్టంగానీ కలిగించరని, జీవితం- మరణం ఆయనే నిర్ణయిస్తాడనే భావన కలిగి ఉంటుంది. ప్రపంచం, ప్రాపంచిక సామగ్రి వారి కొరకు అల్పమైనవిగా ఉంటాయి. పరలోక సఫలతయే నిజమైన సాఫల్యంగా భావించి దానివైపునకే పరుగెడతారు. ఇలాంటి విశ్వాస భాగ్యం లభించిన దానివైపునకే పరుగెడతారు. ఇలాంటి విశ్వాస భాగ్యం లభించిన వారికి దైవ సహాయం లభిస్తుంది. ఆలి ఇమ్రాన్ సూరాలోని 139వ ఆయత్‌లో అల్లాహ్ ఇచ్చిన భరోసాను గుర్తుచేసుకుంటూ ముందుకు సాగిపోవాలి. "క్రుంగిపోకండి, దుఃఖపడకండి, మీరే ప్రాబల్యం పొందుతారు, మీరు విశ్వాసులే అయితే" (దివ్య ఖుర్ఆన్ 3: 139)

ఇప్పుడు ఉమ్మత్‌కు దైవం, దైవప్రవక్త(స)తో "చాలావరకు భావోద్వేగపరమైన సంబంధమే ఉంది. అది వారితో గల ప్రేమను వ్యక్తపరుస్తుంది. వారి కోసం తన ప్రాణాలను కూడా ఇవ్వగలదు. కాని వారి ఆదేశాలకు అనుగుణంగా జీవితం మాత్రం గడపలేదు. ఆరాధనకు దాని దృష్టిలో విలువ లేదు. దీనిపట్ల నిర్లక్ష్యం వహిస్తుంది. ఆరాధనలను పాటిస్తూ ఉన్నా అందులో ఆత్మలేని నిర్జీవత్వం కనబడుతోంది. దాని వ్యక్తిగత, సామాజిక జీవనంపై ఇస్లామేతరుల ప్రభావం రోజురోజుకూ పెరుగుతూనే ఉంది. తన రాజకీయ వ్యవహారాల్లో ఇతరుల మార్గదర్శకత్వాన్ని అనుసరిస్తుంది. ఈ ఉమ్మత్ సమస్త వ్యవహారాలకు, సమస్యలకు పరిష్కారం దైవగ్రంథం, దైవ ప్రవక్త(స) వారి సున్నత్‌లో ఉన్నాయి. ఎలాంటి విషయంలో నైనా దైవగ్రంథం వైపు మరలాలి. అలా చేస్తే చీకట్లు తొలగి నాలుగువైపులా వెలుగుబాట పరుచుకుంటుంది. దైవప్రవక్త(స) ఇలా సెలవిచ్చారు : "నేను మీ మధ్యన రెండు వస్తువులను విడిచి వెళ్తున్నాను, మీరు వాటిని పట్టుకుని ఉన్నంత కాలం రుజుమార్గంలోనే ఉంటారు అవి : దైవగ్రంథం, దైవప్రవక్త(స) సంప్రదాయం."

ఈ రెండింటిని అనుసరించి ఈ ఉద్యమం విజయ సోపానాలను అధిరోహించింది. ఇకపై కూడా అధిరోహించనుంది.

ప్రస్తుతం ఈ ఉమ్మత్ తీవ్ర స్పర్థల్లో, కలతల్లో కూరుకుపోయి ఉంది. కల్పితాలు, అబద్ధాలు, విభేదాలు దీన్ని కలవర పెడుతున్నాయి. ఇందులో జాతి, కులం వంటి విభేదాలు పొడసూపుతున్నాయి. కానీ కుటుంబ విభేదాలకు, నేపథ్యాల భేదాలను తుంచుతూ అరబ్బుకు అరబ్బేతరునికి మధ్య తారతమ్యాలను తుంగలో తొక్కి ఈ ఉమ్మత్ ఉద్భవించింది. మస్లక్‌ల, ఫిఖాల, జమాఅత్‌ల, అంజుమన్‌ల, రాజకీయాల వారీగా జగడాలు జరుగుతున్నాయి. ప్రతీ ఒక్కరూ తమ భావాలను ఇతరులపై రుద్దాలని చూస్తున్నారు. కానీ అల్లాహ్ ఇలా అంటున్నాడు :

"అంతా కలిసి అల్లాహ్ త్రాడును గట్టిగా పట్టుకోండి. విభేదాలలో పడకండి." (దివ్య ఖుర్ఆన్ 3: 103)

ఉమ్మత్ అంతా తమ మధ్యనున్న విభేదాలను మరచి ఒక బలమైన సమూహంగా ఏర్పడనంతవరకూ సాఫల్య మార్గాలు తెరచుకోవు. సీసం పోసిన గోడ వలె స్థిరంగా ఇతరులు దీనికి పగుళ్ళు ఏర్పరచలేనంత బలంగా ఉండాలి. ఈ గోడకు చిన్న బీటలు వారినా వ్యతిరేక శక్తులు తమ కుట్రలతో ఆ పగులును పెద్దగా చీల్చి అనేక శాఖలుగా, సముదాయాలుగా విడదీయడంలో విజయం సాధిస్తాయి.

❖



# దేశంలో మళ్ళీ విద్వేషాగ్ని రెచ్చగొట్టే ప్రయత్నాలు?

రామ మందిర నిర్మాణానికి చందా వసూళ్ళ పేరుతో మధ్యప్రదేశ్‌లో ఊరేగింపులు తీస్తున్నారు. ఈ ఊరేగింపుల్లో కొన్ని మూకలు ముస్లిముల ఇళ్ళు, మస్జిద్‌లు, ఈద్గాలను లక్ష్యంగా చేసుకుని దాడులకు పాల్పడుతున్న సంఘటనలు వెలుగు చూస్తున్నాయి. ఈ పూర్తి వ్యవహారానికి సంబంధించి యునైటెడ్ అగనెస్ట్ హేట్, అసోసియేషన్ ఫర్ ప్రొటెక్షన్ ఆఫ్ సివిల్ రైట్స్ సంస్థలు నేషనల్ హ్యూమన్ రైట్స్ కమిషన్‌లో రెండు వేర్వేరు ఫిర్యాదులు చేశాయి. దాంతోపాటు న్యాయస్థానం ఆశ్రయించే సన్నాహాలు కూడా చేస్తున్నాయి. యునైటెడ్ అగనెస్ట్ హేట్ వ్యవస్థాపక సభ్యులు నదీమ్‌ఖాన్ ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఈ వ్యవహారాన్ని పారదర్శకంగా న్యాయ విచారణ చేపట్టాలన్నారు. దీనిని న్యాయస్థానం విచారించాల్సిందిగా కోరారు. దేశంలో కోవిడ్ మార్గదర్శకాలు అమలు జరుగుతున్నప్పుడు అనుమతి లేకుండా ర్యాలీలు, ఊరేగింపులు ఎలా జరుగుతున్నాయని ప్రశ్నించారు. మొదటి సారి ర్యాలీ నిర్వహించగానే హింస చోటు చేసుకున్నాక అలాంటి ర్యాలీలపై ఎందుకు నిషేధం విధించలేదని అడిగారు. ఊరేగింపు సందర్భంగా మస్జిద్‌లపై దాడి చేసిన సంఘటనల వీడియోలు తెరముందుకు వచ్చాయి. దాడులు చేస్తున్నవారెవరో అందులో స్పష్టంగా ఉంది. అయినప్పటికీ పోలీస్ యంత్రాంగం ముస్లిములపైనే ఎందుకు చర్యలు తీసుకుంటుందని నిలదీశారు. మా స్థానిక బృందాలు అక్కడ పనిచేస్తున్నాయి. ఒక స్థానిక కోఆర్డినేషన్ కమిటీ కూడా రూపొందించాము. దాంతోపాటు ఇండోర్ న్యాయస్థానం ఆశ్రయించేందుకు సన్నాహాలు చేస్తున్నామన్నారు.

యునైటెడ్ అగనెస్ట్ హేట్‌కు చెందిన జైద్‌పఠాన్ మాట్లాడుతూ, ఇండోర్ చుట్టుప్రక్కల నివసించే ముస్లిములు భయపడిపోతున్నారు. హింస చెలరేగిన ప్రాంతంలోని ముస్లిములు భయంతో తమ ఇళ్ళను వదిలిపెట్టి బంధువుల ఇళ్ళల్లో ఆశ్రయం పొందుతున్నారు. ఇక్కడ నిరుపేద ముస్లిములు ఎంతో మంది ఉన్నారు. పౌల్ట్రీ ఫారాల్లో పనిచేస్తుంటారు. ఈ సంఘటన కారణంగా వారు తమ ఉపాధిని కోల్పోయారు.

హింసకు పాల్పడిన బాధితులపై సామాన్యమైన కేసులు పెట్టారని, దానివల్ల వారు మరుసటిరోజే బెయిల్‌పై బయటికి వచ్చారని ఆయన ఆరోపించారు. మరోవైపు బాధితులపై కఠినమైన కేసులు పెట్టి వారిని అరెస్ట్‌లు చేస్తున్నారన్నారు. యంత్రాంగం నిందితులకు అండగా నిలబడుతుందన్నారు.

ముస్లిములపై దాడి జరిగింది, ముస్లింలకే నష్టం వాటిల్లింది, అరెస్టులు కూడా ముస్లిములవే ఎక్కువగా జరుగుతున్నాయి. ఇది చాలా విచిత్రంగా ఉందన్నారు.

ముస్లిములకు మందిర నిర్మాణం పట్ల గానీ, దాని పేరుతో చందాలు వసూలు చేస్తున్నవారి పట్ల గానీ ఎలాంటి సంబంధం లేదు. మా ప్రశ్న ఏమిటంటే, ముస్లిమ్ జనాభా అధికంగా ఉన్న ప్రాంతాల్లో చందా వసూళ్ళు చేయడంలోని ఉద్దేశం ఏమిటి? అక్కడి ప్రాంతాల్లోకి వెళ్ళి రెచ్చగొట్టే నినాదాలు ఎందుకు చేశారు? ర్యాలీల్లో ఆయుధాలు, కత్తులు తీసుకు వెళ్ళడంలోని మతలబు ఏమిటి?

జైద్ పఠాన్ ఒక ప్రతినిధితో కలిసి వెళ్ళి ఇండోర్ అసిస్టెంట్ డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ యోగేష్ దేశ్‌ముఖ్‌ను కలిసి ఒక మెమోరాండం సమర్పించారు.

రామ మందిర నిర్మాణం కోసం చందావసూళ్ళు చేస్తూ తీస్తున్న ర్యాలీల వల్ల మధ్యప్రదేశ్‌లోని అనేక ప్రాంతాల్లో హింస చెలరేగింది. డిసెంబర్ 25న ఉజ్జయిని ప్రాంతంలో తొలిసారి హింస వెలుగు చూసింది. ఆ తరువాత ఇండోర్‌లో పునరావృతమైంది. డిసెంబర్ 29వ తేదీన గౌతమ్‌పురా దగ్గరలోని చందన్ ఖేడీ గ్రామంలో మస్జిద్ మినార్ కూల్చడమే కాకుండా ముస్లిముల ఇళ్ళపై దాడులు జరిగాయి. దుండగులు అనేక దుకాణాలు, వాహనాలకు నిప్పు పెట్టారు. ఈ హింస పెచ్చరిల్లిన మరుసటి రోజే పోలీసులు డజన్లకొద్దీ ఇళ్ళను ధ్వంసం చేశారు. ఇలా ఎందుకు చేశారని నిలదీసినప్పుడు రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా ఇలా చేయాల్సి వచ్చిందని చెప్పారు. మందసౌర్‌లో కూడా ఇలాంటి ఘటనలే చోటు చేసుకున్నాయి. ఇంత జరుగుతున్నా మునుపటి మాదిరిగానే రాజకీయ పార్టీలన్నీ మౌనంగా ఉండిపోయాయి.

### దేశవ్యాప్తంగా చందా వసూళ్ళ కార్యక్రమం

విశ్వహిందూ పరిషద్ రామ మందిర నిర్మాణం కోసం చందా వసూళ్ళ కార్యక్రమాన్ని ప్రారంభించింది. జనవరి 15 నుంచి ఫిబ్రవరి 27వ తేదీవరకు కొనసాగుతుంది.

1990 కాలంలో ఏం జరిగిందో ప్రస్తుతం అదే పునరావృతం అవుతున్నట్లు కనిపిస్తుంది. అప్పుడు కూడా చందా వసూళ్ళ కోసం విశ్వహిందూ పరిషద్, బిజెపి నేతలు ప్రతి గ్రామంలో ర్యాలీలు నిర్వహించారు. రెచ్చగొట్టే నినాదాలు చేసి దేశంలో విద్వేష వాతావరణం నెలకొల్పారు. అప్పుడు కూడా రామ మందిర నిర్మాణం పేరుతో కోట్ల రూపాయలు పోగు చేశారు. దాని లెక్క ఇప్పటి వరకు ఎవరూ ఇవ్వలేదు. అయితే మరోసారి విశ్వహిందూ పరిషద్, బిజెపి రామ మందిర నిర్మాణం కోసం చందా వసూళ్ళ పేర దేశంలో విద్వేషాలు రెచ్చగొట్టే ప్రయత్నాలు చేస్తున్నారా? అన్నదే సందేహం. డిజిటల్ ఇండియా కాలంలో ర్యాలీలు నిర్వహించి మరీ చందాలు వసూళ్ళు చేసే అవసరం ఏమొచ్చింది?

*(దావత్ న్యూస్)*


**మస్జిద్ ఇషాఅతె ఇస్లామ్ ఢిల్లీ కోసం**

**విరాళాల సేకరణ**

ఢిల్లీలోని జమాఅతె ఇస్లామీ హింద్ కేంద్ర కార్యాలయం ప్రాంగణంలోని మస్జిద్ ఇషాఅతె ఇస్లామ్ నిర్మాణ పనులు చివరి దశకు చేరుకున్నాయి. గత కొన్నేళ్ళుగా నమాజీల రాక పెరగడంతో మస్జిద్ ఇరుకుగా మారింది. ముఖ్యంగా జుమా నమాజ్, రమజాన్ మాసం, ఈద్ నమాజ్‌లలో ఈ రద్దీ మరింత పెరుగుతోంది. దీంతో మస్జిద్ విస్తరణ పనులు చేపట్టాం. అల్‌హమ్దులిల్లాహ్ నాలుగేళ్ళ క్రితం ప్రారంభించిన విస్తరణ పనులు ఇప్పుడు తుది దశకు చేరుకున్నాయి. ఇన్షాఅల్లాహ్ పది వేల మంది నమాజ్ చదివే వీలుంటుంది.

రాబోయే రమజాన్ లోపే నిర్మాణ పనులు పూర్తి చేసేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నాము.

మా విన్నపం ఏమిటంటే, మస్జిద్ విస్తరణ మహత్కార్యంలో మీరూ భాగస్వాములై గొప్ప ప్రతిఫలం పొందగలరు.

అల్లాహ్ మీకు ఉత్తమ ప్రతిఫలం ప్రసాదించుగాక!

**అకౌంట్ వివరాలు**

చెక్‌పై కేవలం **"Ishaat-e-Islam Trust"** అని మాత్రమే వ్రాయండి

**ISHAAT-E-ISLAM TRUST**

**A/c No. 1447308306**
**IFSC Code : CBIN0282953**

**Central Bank of India,**
**Sukhdev Vihar, New Delhi**




# ముస్లింలు సమాజానికి మార్గదర్శకులుగా నిలవాలి..

## జమాఅతె ఇస్లామీ సమావేశంలో ఆం.ప్ర.రాష్ట్ర అధ్యక్షులు ముహమ్మద్ రఫీఖ్

దేశంలో ముస్లింల పరిస్థితులు నానాటికీ తీసికట్టుగా మారుతున్నాయని, అన్ని రంగాల్లో వెనుకబడి ఉన్నారని జమాఅతె ఇస్లామీ హింద్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు ముహమ్మద్ రఫీఖ్ ఆందోళన వ్యక్తం చేశారు. జమాఅతె ఇస్లామీ హింద్ కర్నూలు జిల్లా స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. జనవరి 17న నంద్యాలలో “దైవం వైపునకు మరలండి” అన్న అంశంపై నంద్యాల అంటికోట మస్జిదులో జరిగిన ఈ సమావేశంలో డా. ముహమ్మద్ రఫీఖ్ మాట్లాడుతూ... ఎన్ని ప్రతికూలతలు ఎదురైనా దైవం పట్ల విశ్వాసంతో ఆత్మస్థయిర్యంతో ముందుకు సాగాలని, నైతికంగా సమాజంలో ఆదర్శాలను నిలపాలని ఉద్బోధించారు. అన్యాయాలను ప్రతిఘటించే తత్వం అలవరుచుకోవాలనీ, ఆ మార్గంలో వచ్చే కష్టాలను సహనంతో ఎదుర్కోవాలని అన్నారు. జనాబ్ చాంద్ బాష ఏడియస్ అనంతపూర్ దర్సే ఖుర్ఆన్‌తో ఉదయం పది గంటలకు ప్రారంభమైన సమావేశంలో కర్నూలు జిల్లా నాజిం హాఫిజ్ షబ్బీర్ హుసేన్ తొలి పలుకులతో సమావేశం ప్రారంభమైంది. “ఆదర్శ ముస్లిం కుటుంబం” అన్న అంశంపై కర్నూలు పట్టణ అధ్యక్షులు జనాబ్ అమీర్ తల్లిదండ్రుల హక్కులు సోదాహరణంగా తెలిపారు. “విశ్వాసి ఖుర్ఆన్ దర్పణం” అన్న అంశంపై మౌలానా జియాఉద్దీన్ ముహమ్మదీ మాట్లాడుతూ... విశ్వాసి జీవితం దైవభీతితో ఒదిగి ఉండాలని ఉద్బోధించారు. “పరలోక చింతన ఉన్నత సాధన” అన్న అంశంపై మౌలానా అబ్దుల్ అలీం ఉమ్రీ ప్రసంగించారు. సాయంత్రం ఐదు గంటల వరకు కొనసాగిన ఈ సమావేశంలో వివిధ అంశాలపై పలువురు వక్తలు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మొహతరమా హుమేరా బాను రాయలసీమ మహిళ కార్యదర్శి; కర్నూలు, అనంతపూర్ ఏరియా కార్యదర్శులు జనాబ్ చాంద్ బాష, అష్రఫ్ అలీ, బనగానపల్లె అమీర్, ఎమ్మిగనూరు అమీర్ ముహమ్మద్ గౌస్, కర్నూలు అమీర్ డా. రహమాన్, నంద్యాల అమీర్ జకరియా మరియు సభ్యులు కార్యకర్తలు పాల్గొన్నారు. ప్రకాశం జిల్లా సభ్యులు, కార్యకర్తలు హాజరయ్యారు. నాజిమే ఇజ్తెమాగా అబ్దుల్ సమద్ ఇజ్తెమా నిర్వహణ బాధ్యతలు చేపట్టారు.

### ఆత్మీయ సమావేశం

మగ్రిబ్ నమాజ్ అనంతరం మస్జిదులో వివిధ రాజకీయ పార్టీల నాయకులతో ప్రజాసంఘాలతో ఆత్మీయ సమావేశం జరిగింది. జనాబ్ అబ్దుల్ సమద్ కన్వీనర్‌గా వ్యవహరించిన ఈ కార్యక్రమంలో జమాఅతె ఇస్లామీ హింద్ ఆం.ప్ర. అధ్యక్షులు జనాబ్ ముహమ్మద్ రఫీఖ్ మాట్లాడుతూ దేశంలో మతతత్వ శక్తులను అడ్డుకొనుటకు లౌకిక శక్తులు ఏకం కావాలని, పరస్పరం మత పెద్దలు కలుస్తుండడం వల్ల వారి మధ్య ఉన్న అపోహలు తొలగి పోతాయన్నారు. సమావేశంలో ముహమ్మద్ గౌస్ (సీపియం), రాష్ట్ర ఇమాం కౌన్సిల్ కార్యదర్శి హాఫిజ్ అతావుల్లాహ్ ఖాన్, వాల్మీకి రాష్ట్ర నాయకులు పులి కొండన్న, మస్తాన్ ఖాన్ (కాంగ్రెస్), మౌలానా అబ్దుల్ సలాం (యూనియన్ ముస్లిం లీగ్), ఫాజిల్ దేశాయ్ పాపులర్ ఫ్రంట్, ఇఖ్బాల్, శివరామి రెడ్డి, వైసిపి రమణ, జానోజాగో మహబూబ్ బాషా, ఆల్ మేవ అబూలైస్ తదితరులు మాట్లాడారు.

**రిపోర్టు : షేక్ అబ్దుల్ సమద్**



# చదువూ సంస్కారం

**- షేక్ అబ్దుల్ బాసిత్ కొత్త గూడెం**

మానవ జీవిత మర్మాన్ని తెలిపి, సృష్టి జీవరాశుల్లో అత్యుత్తమ జీవి అయిన మనిషిగా ఈ భూమి మీద ఎలా జీవించాలో, ఎలా జీవిస్తే ఇహపరాల సాఫల్యం లభిస్తుందో ఆ సృష్టికర్త అయిన అల్లాహ్ దైవ గ్రంథం ఖుర్‌ఆన్‌లో వివరించాడు. అందులో మొట్ట మొదటగా అవతరించిన సూక్తి "ఇఖ్రా", అంటే చదువు అనే పదంతో ప్రారంభం అయింది. "ప్రతి స్త్రీ పురుషుడు తప్పనిసరిగా చదువుకోవాలి" అని పదిహేను వందల సంవత్సరాల క్రితమే ప్రవక్త ముహమ్మద్ (సఅసం) బోధించారు. అంతేకాదు అందుకు కావలసిన ఏర్పాట్లు చేశారు. ఆయన సతీమణి ఆయిషా (ర.అ) విద్యలో ఆనాటి మహా పండితులతో సరితూగేవారు. జ్ఞాన సముపార్జన కోసం ప్రయత్నాలు చేస్తున్న వారి కోసం ఆకాశంలో పక్షులు, భూమి మీద సకల జీవకోటి, నీటిలోని జలచరాలు అంటే యావత్ సృష్టి ప్రార్థన చేస్తాయి అని అన్నారు ప్రవక్త ముహమ్మద్ (స). అంటే జ్ఞానం ఉన్నవారు సృష్టికి (ప్రకృతికి) ఎలాంటి హానీ జరగకుండా జాగ్రత్త వహిస్తారు. అప్పుడే సకల జీవకోటి చీకుచింతా లేకుండా జీవిస్తుంది. అందుకే జ్ఞాన సముపార్జన కోసం కృషి చేస్తున్న వారి గురించి అందరూ ప్రార్థిస్తారు అని అర్థం."జ్ఞానాన్ని ఆర్జించడానికి ఎంత దూరం అయినా వెళ్ళండి" అని అన్నారు ప్రవక్త ముహమ్మద్(స). అంటే జ్ఞానాన్ని నేర్చుకోవడానికి ఎన్ని కష్టాలు ఎదురైనా, ఎంత దూరం వెళ్ళాల్సి వచ్చినా అక్కడికి వెళ్ళి చదువు నేర్చుకోవాలి అని అర్థం. నేర్చుకున్న జ్ఞానాన్ని సమాజం హితం కోసం వినియోగించాలి. తుచ్ఛమైన ప్రాపంచిక భోగలాలసల కోసం, మృత్యువుతో ముగిసిపోయె జీవితంలో కీర్తి ప్రతిష్ఠలు పొందడానికి వినియోగించరాదు. ఆర్జించిన జ్ఞానాన్ని సమాజ శ్రేయస్సు కోసం వినియోగించాలి. ఇతరులకు నేర్పించడానికి ఉపయోగించాలి. ఎందుకంటే రేపు పరలోకంలో 'జ్ఞానాన్ని ఎందుకు ఆర్జించారు ? ఆర్జించిన జ్ఞానాన్ని ఎక్కడ, ఎలా వినియోగించారు? అని ప్రశ్నించబడతారని ప్రవక్త ముహమ్మద్(స) తెలిపారు.

సమాజంలో ఎలా మసలుకోవాలో, సాటి మనిషితో ఎలా వ్యవహరించాలో చదువు నేర్పుతుంది. ❖

## ఇస్లామ్ ద్వారానే కుటుంబ వ్యవస్థ పటిష్టం

ఇస్లామ్ బోధనల వెలుగులోనే కుటుంబ నిర్మాణం జరగాలి. పిల్లలకు, యువతకు ఇస్లామ్ శిక్షణ ఇప్పించాలి. పాశ్చాత్య సంస్కృతి నుంచి, దురాచారాల నుంచి వారిని కాపాడాలి. వారు మంచిని స్థాపించడం, చెడును నిర్మూలించడంలో తమ పాత్ర పోషించాలి. వారు తమ హక్కులు, విధులు సక్రమంగా నిర్వర్తించే సరైన భావన కలిగి ఉండాలని జమాఅతె ఇస్లామీ హింద్ జాతీయ అధ్యక్షులు సయ్యిద్ సఆదతుల్లాహ్ హుసైనీ వెల్లడించారు. జమాఅతె ఇస్లామీ హింద్ మహిళా శాఖ ఫిబ్రవరి 19 నుంచి 28 వరకు చేపట్టనున్న ఆదర్శ కుటుంబం ఉద్యమానికి సంబంధించి నిర్వహించిన ఒక వెబినార్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. జమాఅత్, మత బోధకుల సహాయంతో సమాజంలో నెలకొన్న రుగ్మతలను దూరం చేయడానికి కృషి చేస్తుందన్నారు. పాశ్చాత్యులు, అభివృద్ధి చెందిన సమాజాలు కూడా కుటుంబ పరిరక్షణ విలువను తెలుసుకున్నాయి. కుటుంబ వ్యవస్థను పటిష్టం చేయడం అనేది ఇస్లామ్‌తోనే సాధ్యం అన్నారు. ఇస్లామ్ పేర్కొన్న కుటుంబ భావనలో దైవాదేశాల పాలన ఉంటుంది. మన ముస్లిమ్ సముదాయం ఒక ఆదర్శ కుటుంబంగా నెలకొల్పాలన్నదే ఈ ఉద్యమ లక్ష్యం అన్నారు. ఈ సందర్భంగా జమాఅత్ జనరల్ సెక్రెటరీ టీ.ఎమ్ ఆరిఫ్ అలీ ఉద్యమ లోగోను విడుదల చేశారు. లోగోను ఛత్తీస్‌గడ్‌కు చెందిన ఇరమ్ రహ్మాన్ డిజైన్ చేశారు.




## మధ్యప్రదేశ్ ముస్లిములపై దౌర్జన్యం

మధ్యప్రదేశ్‌లోని కొన్ని జిల్లాలు, మంద సౌర్, ఉజ్జయిని, ఇండోర్‌లలో మతతత్వ శక్తులు ముస్లిములపై హింసోన్మాదానికి పాల్పడటం పట్ల వెల్ఫేర్ పార్టీ ఆఫ్ ఇండియా జాతీయ అధ్యక్షులు డాక్టర్ సయ్యద్ ఖాసిమ్ రసూల్ ఇల్యాస్ విచారం వ్యక్తం చేశారు. కొన్ని అసాంఘిక శక్తులు చందా వసూళ్ళ పేరుతో ముస్లిములపై దాడులు చేశాయని, ఇళ్ళను ధ్వంసం చేశాయని, వాహనాలకు నిప్పంటించాయని ఖాసిమ్ రసూల్ ఇల్యాస్ పేర్కొన్నారు. ఇంత హింస జరుగుతున్నా పోలీసులు ప్రేక్షక పాత్ర వహించారే తప్ప ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. గోదీ మీడియా ఈ వ్యవహారాన్ని ప్రసారం చేయడానికి సాహసించలేదని ఆరోపించారు. ఈ పూర్తి వ్యవహారాన్ని హైకోర్టు జడ్జి ద్వారా విచారించాలని డిమాండ్ చేశారు. నిందితులపై కేసులు పెట్టాలన్నారు. మస్జిద్ లకు, ఇళ్ళకు జరిగిన నష్టాన్ని పూడ్చుతూ ప్రభుత్వం వాటి నిర్మాణం చేపట్టాలన్నారు. లేదా ప్రభుత్వం నుంచి పూర్తి నష్టపరిహారం ఇప్పించాలన్నారు. ఇకముందు ఇలాంటి ర్యాలీలకు అనుమతులు ఇవ్వకుండా నిర్మూలించాలని కోరారు.

## పీఎం కేర్స్ నిధులు ఏమయ్యాయి?

పీఎం కేర్స్ నిధుల పారదర్శకతపై ప్రధాని నరేంద్ర మోడీకి 100 మంది మాజీ ఉన్నతాధికారుల బృందం బహిరంగ లేఖ రాసింది. 'కోవిడ్ మహమ్మారి బారిన పడిన ప్రజల ప్రయోజనాల కోసం సృష్టించిన ఈ ఫండ్‌కు సంబంధించి కొనసాగుతున్న చర్చను మేం పూర్తిగా గమనిస్తున్నాం. ప్రజా ప్రయోజనాల కోసం సృష్టించిన ఈ ఫండ్ నిర్వహణా విధానం సమాధానంలేని అనేక ప్రశ్నలకు ఆస్కారమిస్తున్నది' అని ఆ లేఖలో పేర్కొన్నారు. ఈ లేఖ రాసినవారిలో ఐఏఎస్ మాజీ అధికారి అనితా అగ్నిహోత్రి, ఎస్పీ అంబ్రోస్, శరద్ బెహర్, సజ్జాద్ హసన్, హర్ష్‌మందర్ తదితరులున్నారు. గత ఏడాది మార్చిలో ఈ నిధిని ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. దీనికి భారీగా విరాళాలు అందాయి. 2020 మార్చి 27న ప్రారంభమైన ఈ నిధికి కేవలం ఐదు రోజుల్లోనే రూ.3076.62 కోట్లు వచ్చినట్టు ఈ మధ్యే విడుదల చేసిన ఆడిట్ నివేదిక వెల్లడించింది. కానీ, మార్చి 31 తర్వాత వచ్చిన విరాళాల గురించి ఎక్కడా ప్రస్తావించలేదు. దీంతో ఇది అసలు ప్రభుత్వానిదా? లేక ప్రైవేటుదా? అనే ప్రశ్నలు మొదలయ్యాయి. ఈ నేపథ్యంలో విపక్షాల నుంచి అనేక విమర్శలు వెల్లువెత్తాయి. ఇప్పటికే ప్రధాన మంత్రి జాతీయ సహాయ నిధి ఉండగా కొత్తగా దీన్ని ఎందుకు రూపొందించారని విపక్షాలు ప్రశ్నించాయి.

## బాలాకోట్ దాడుల గురించి అర్నబ్ గోస్వామికి ముందే తెలుసా..?

గత ఏడాది పాకిస్తాన్‌లోని బాలాకోట్ ఉగ్ర స్థావరాలపై భారత్ సైన్యం జరిపిన సర్జికల్ స్ట్రైక్స్ గురించి రిపబ్లికన్ టివి నేత అర్నబ్ గోస్వామికి ముందే తెలుసా.. అంటే అవుననే వాదన వినిపిస్తోంది. అయితే అత్యంత గోప్యంగా ఈ దాడులు జరిగాయని కేంద్రం చెబుతుండగా..అర్నబ్ గోస్వామికి తెలియడం ఇప్పుడు ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది. ఫిబ్రవరి 23న బ్రాడ్‌కాస్ట్ ఆడియన్స్ రీసెర్చ్ కౌన్సిల్ (బిఎఆర్‌సి) మాజీ సిఇఒ పార్థో దాస్‌గుప్తాతో జరిపిన వాట్సప్ చాట్‌లో ఈ విషయమే వెల్లడైంది. టెలివిజన్ రేటింగ్ స్కాం కుంభకోణంలో అరెస్టైన అర్నాబ్‌పై దాఖలు చేసిన 3,400 పేజీల చార్జిషీట్‌లో ముంబై పోలీసులు ఈ విషయాన్ని కూడా పొందుపరిచారు. దీంతో అర్నబ్ సందేశాలపై అత్యున్నత స్థాయి దర్యాప్తు చేపట్టా లని ప్రతిపక్షాలు డిమాండ్ చేస్తున్నాయి.

## ఇస్లామ్‌ను జీవన విధానంగా మార్చుకోవాలి

"మహిళలు ధార్మిక బోధనలను ఆచరించాలి. ఇస్లామ్‌ను తమ జీవన విధానంగా మలచుకోవాలి" ఈ సందేశం ఆల్‌ఇండియా బిన్‌తుల్ ముస్లిమ్ మూడు రోజుల వర్క్‌షాపులో ఇవ్వడం జరిగింది. ఆలిండియా ముస్లిమ్ పర్సనల్ లా బోర్డు మహిళా విభాగం ఈ కార్యక్రమాన్ని జనవరి 5-7 తేదీలలో జూమ్ ద్వారా నిర్వహించింది. ఈ వర్క్‌షాపులోని ఆరు సెషన్‌లలో 500 మంది విద్యార్థులు పాల్గొన్నారు. యూట్యూబ్‌లో 1200 నుంచి 1500 మంది లైవ్‌లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ ఉలమాలు ప్రసంగించారు. ముస్లిమ్ పర్సనల్ లా బోర్డు జనరల్ సెక్రెటరీ మౌలానా ముహమ్మద్ వలీ రహ్మానీ మాట్లాడుతూ, సమాజం, సంఘం చెప్పే మాటలతో కాకుండా ఖుర్ఆన్, ప్రవక్త(స) జీవితానికి అనుగుణంగా మహిళలు తమ జీవితాలు తీర్చిదిద్దుకోవాలన్నారు. ప్రపంచం ఏమంటుంది? మీడియా ఏం చెబుతోంది? ప్రజలు ఏమనుకుంటారో అని ఆలోచించకూడదు. ప్రళయం రోజు అల్లాహ్ ముందు నిలబడినప్పుడు ఆయనకు ఏమని సమాధానం ఇస్తాం అని ఆలోచించాలన్నారు. మౌలానా ఖలీలుర్రహ్మాన్ సజ్జాద్ నోమానీ మాట్లాడుతూ, విద్య అతిపెద్ద ఆయుధం. విద్యలో ఎప్పుడూ ముందుండాలి. పుస్తకాలు పఠించాలి. సైన్స్ ఇతర అంశాల్లో నైపుణ్యం సాధించాలన్నారు. ముస్లిమ్ యువతులు ముస్లిమ్ సముదాయం కోసమే కాకుండా యావత్ మానవులకు మేలు చేకూరుస్తారన్న ఆశాభావం వ్యక్తం చేశారు. వీరేకాకుండా పలువురు మహిళా వక్తలు కూడా ఈ వర్క్‌షాపులో ప్రసంగించారు.

## సర్వత్రా

## లిబియా సంక్షోభ పరిష్కారంలో పురోగతి



దశాబ్దాల తరబడి కొనసాగుతున్న లిబియా సంక్షోభాన్ని పరిష్కరించడంలో స్పష్టమైన పురోగతి కనిపిస్తోందని ఐక్యరాజ్య సమితి ప్రధాన కార్యదర్శి ఆంటానియో గుటెరస్ వ్యాఖ్యానించారు. భద్రతా మండలికి అందచేసిన నివేదికలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ వారాంతానికి ఆ దేశం నుండి విదేశీ బలగాలు వైదొలగాలని ఆయన డిమాండ్ చేశారు. గత కొద్ది మాసాలుగా కొనసాగుతున్న లిబియా అంతర్గత రాజకీయ, భద్రతా, ఆర్థిక చర్చలు మరింత ముందుకు సాగడంలో స్పష్టమైన ప్రగతిని సాధించామని ఆ నివేదిక పేర్కొంది. ఐక్యరాజ్య సమితి ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ చర్చలు గణనీయమైన ఉత్తేజాన్ని ఇచ్చాయని ఆ నివేదిక తెలిపింది. రాజకీయ, భద్రత, ఆర్థిక, అంతర్జాతీయ మానవతా చట్టం, మానవ హక్కుల రికార్డు వంటి అంశాల్లో పురోగతి కనిపిస్తోందని, శాంతి, సుస్థిరత, అభివృద్ధి దిశగా ముందుకు సాగుతోం దని పేర్కొంది.

## బైడెన్ టీమ్‌లో కశ్మీరీ మహిళ



అమెరికా 46వ దేశాధ్యక్షునిగా జోసెఫ్ బైడెన్ ప్రమాణ స్వీకారం చేసిన సంగతి తెలిసిందే. అయితే కరోనా మహమ్మారితో చతికిలపడ్డ అమెరికా ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసేందుకు బైడెన్ ఓ ఆర్థిక బృందాన్ని ఏర్పాటు చేశారు. విభిన్న వర్ణాలకు చెందిన ప్రజలకు ఆ బృందంలో కీలకమైన బాధ్యతలను అప్పగిస్తున్నారు. బైడెన్ ఏర్పాటు చేయబోయే నేషనల్ ఎకనామిక్ కౌన్సిల్ బృందంలో కశ్మీర్ మూలాలు ఉన్న సమీరా ఫాజిలీకి చోటు దక్కింది. ఎన్ఈసీ డిప్యూటీ డైరక్టర్‌గా ఆమె పనిచేయనున్నారు. తయారీ, ఉత్పత్తి, ఆవిష్కరణ, స్వదేశీ పోటీతత్వం లాంటి అంశాలపై ఆమె ఫోకస్ చేయనున్నారు. సమీరా ఫాజిలీకి ముగ్గురు పిల్లలు ఉన్నారు. అట్లాంటా ఫెడరల్ రిజర్వ్ బ్యాంకులో డైరక్టర్‌గా చేశారామె. వైట్‌హౌజ్‌లోని నేషనల్ ఎకనామిక్ కౌన్సిల్‌లో సీనియర్ పాలసీ అడ్వైజర్‌గా చేశారు. రిటైర్మెంట్, కన్స్యూమర్ ఫైనాన్స్, కమ్యూనిటీ, ఎకనామిక్ డెవలప్మెంట్ లాంటి శాఖలను ఆమె చూశారు. ఒబామా పాలన సమయంలో ఆమె ట్రెజరీ శాఖలోనూ పని చేశారు. హార్వర్డ్ కాలేజీ, యేల్ న్యాయ పాఠశాలలో గ్రాడ్యుయేషన్ పూర్తి చేశారు. యేల్ లా స్కూల్‌లోనే క్లినికల్ లెక్చరర్‌గా చేశారు. న్యూయార్క్‌లోని యూసుఫ్, రఫీకా దంపతులకు ఆమె జన్మించారు.

## ఇస్రాయిల్‌తో ఫ్రీ వీసా ఒప్పందం తాత్కాలికంగా రద్దు చేసిన యూఏయి

ఇటీవల యూఏయిా ఇస్రాయిల్‌తో ఫ్రీ వీసా ఒప్పందం కుదుర్చుకుంది. దాని ప్రకారం ఇస్రాయిలీ పౌరులు వీసా లేకుండా యూఏయిాలో పర్యటించవచ్చు. అయితే ఈ ఒప్పందాన్ని యూఏయిా జులై వరకు తాత్కాలికంగా రద్దు చేసిందని ఇస్రాయిల్ విదేశాంగ శాఖ వెల్లడించింది. కరోనా వ్యాపిస్తున్న కారణంగా యూఏఈ ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపింది. అప్పటి వరకు తమ దేశ పౌరులు యూఏఈ పర్యటించాలనుకుంటే వీసా తీసుకోవాల్సి ఉంటుందని పేర్కొంది.

## ఐక్యరాజ్యసమితిలో ఓటుహక్కు కోల్పోయిన ఏడు దేశాలు

ఐక్యరాజ్యసమితికి (యూఎన్) బాకీ పడ్డ మొత్తాన్ని సకాలంలో చెల్లించని కారణంగా ఏడు దేశాలు యూఎన్‌లోని తమ ఓటు హక్కునే కోల్పోయాయి. ఇవి తమ అభిప్రాయాన్ని అధికారికంగా వ్యక్తీకరించే అవకాశానికి దూరమయ్యాయి. ఈ విషయాన్ని యూఎన్ సెక్రెటరీ జనరల్ ఆంటోనియో గుటెర్రస్ వెల్లడించారు. ఈరాన్‌తో పాటూ నైజీరియా, లిబియా, ది సెంట్రల్ ఆఫ్రికన్ రిపబ్లిక్, కాంగో, దక్షిణ సుడాన్, జింబాబ్వే, బ్రెజిల్‌లు తమ ఓటును కోల్పోయాయి. అయితే.. కొమొరోస్, సావ టోమ్, ప్రిన్సెప్, సోమాలియా దేశాలు కూడా యూఎన్‌కు బాకీ పడ్డప్పటికీ ఓటు హక్కును మాత్రం పరిరక్షించుకోగలిగాయి. ఆర్థిక పరిస్థితుల కారణంగానే బాకీ తీర్చలేకపోయామని ఈ దేశాలూ నిరూపించుకోగలిగాయని గుటెర్రస్ ఈ సందర్భంగా తెలిపారు. ఐక్యరాజ్య సమితి నిబంధనల ప్రకారం.. ఏ దేశమైనా రెండు సంవత్సరాలకు మించి యూఎన్‌కు చెల్లించాల్సిన ఫీజులు బాకీ పెడితే ఆ దేశం జనరల్ అసెంబ్లీలో తన ఓటు హక్కును కోల్పోతుంది.

**కాలమనే కడలిలో** మరో కెరటం లేచింది. మానవ చరిత్ర మరో మైలురాయి దాటింది. చరిత్రలో ఏ సంవత్సరానికా సంవత్సరం ప్రత్యేక ప్రాధాన్యత కలిగి ఉంటుంది. కొత్తదనం అంటే చిత్తానికి ఎప్పుడూ ఉత్తేజమే. పాత జ్ఞాపకాల స్థానంలో రానున్న భవిష్యత్తును ఊహించుకుంటూ రాబోయే సమయం సంతోషంగా గడవాలని కోరుకుంటాడు మనిషి.

ఉషాకాంతుల వంటి పసిడి కలలతో మిసిమి భవితవ్యానికి సుస్వాగతం పలికే సంప్రదాయం వెనుకున్న రహస్యం మనిషి నిత్య ఆశావాది కావడమే! ఆ ఆశావాదమే అడవి మనిషిని అణు అధికారిగా మార్చింది. ఎదురుదెబ్బలెన్ని ఎదురైనా అదరక, బెదరక సమస్యల సునామీలకు ఎదురేగి మరీ దూసుకుపోయే సుగుణమే మనిషిని ఇతర జీవరాసులలో శ్రేష్ఠుణ్ణి చేసింది. శిశిరం వస్తుంది పోతుంది, మళ్లీ వస్తుంది. అయినా వసంత పవన తాకిడికే పరవశించిపోతుంది కోయిల. మధుమాసం రాగానే మావిచిగురు కొమ్మ మీద చేరి రాగాలాపన చేస్తుంది. అలాగే గత అనుభవాలు ఎలా ఉన్నా రాబోయే కాలమంతా సర్వేజనా సుఖినోభవంతు, సర్వ జనావళికి శుభాలే కలగాలని మనసారా ఆపేక్షించడం ఒక్క మనిషికే చెల్లింది. అయితే 2020లో ఈ మనిషి చేసిందేమిటి? అంటే, 'పతనంతో పోరాటం' అనక మానదు.

పోరాటం, అది అరబ్బు ప్రపంచంలో నియంతలపై సాగిన ఆగ్రహ జ్వాలలే కావచ్చు. ఐరోపాలో ఆర్థిక సంక్షోభంపై సమరమే కావచ్చు. భారతదేశంలో సిఏఏ, ఎన్ఆర్సి నిరసనలే కావచ్చు. సామ్రాజ్యవాదులను సమస్యల్లోకి, సామాన్యులను కష్టాల్లోకి నెట్టిన, ముంచుతున్న ఆర్థిక సంక్షోభమే కావచ్చు. కరోనా మహమ్మారి విలయతాండవమే కావచ్చు వెరసి 2021 వీటికి ఓ పెను సవాల్!

ఏది ఏమైనా, కాలం దాని విలువ అమూల్యం. అది కలిమితో కొనలేనిది, బలిమితో వశపర్చుకోలేనిది. ఒక్కసారి చేజారితే తిరిగి సంపాదించుకోలేనిది. పట్టుకోలేనిది, వెతికి వెనక్కి తెచ్చుకోలేనిది. అందుకే శిశిరంలో సయితం వసంతాన్నే



# కరిగే మంచు కాలం

## సయ్యిద్ అబ్దుస్సలామ్ ఉమరీ

కలగనాలి. గతాన్ని సింహావలోకనం చేసుకుని దైవ విధేయతే పునాదిగా బంగారు భవిత కట్టుకోవాలి.

కాలం సాక్షిగా! నిశ్చయంగా మానవుడు నష్టంలో పడి ఉన్నాడు. అయితే విశ్వసించి, సత్కార్యాలు చేసినవారు, పరస్పరం సత్యం గురించి ఉపదేశించినవారు, ఒండొకరికి సహనం (స్థయిర్యం) గురించి తాకీదు చేసిన వారు మాత్రం నష్టపోరు. (అల్ అస్ర్: 1-3)

పత్రిక కాదిది, ఆత్మవేదన
క్రియాత్మక చేతన
గీటురాయి
వారపత్రిక

Edited, Printed & Published by S.M. Mallick on behalf of Telugu Islamic Publications, Typeset at "Geeturai Graphics", Printed at Cosmic Printers, Lakkadkot, Hyderabad-2, RNI R.No.37796/81, Postal Regn. No.HSE/422/2020-2022 Phone: 24564583. **e-mail : geeturaiweekly@gmail.com**

# మీ ఇల్లే ఓ లైబ్రరీ!



## తెలుగు ఇస్లామిక్ పబ్లికేషన్స్ ట్రస్టు పుస్తకాలు

## 40% OFF డిస్కౌంటు

**రూ. 17 వేలు విలువ చేసే 316 పుస్తకాలు**

**రూ.10 వేలకే మీ సొంతం చేసుకోండి!**

ఖుర్ఆన్, హదీసు, ఫిఖా, సీరత్, ప్రవక్తల జీవిత గాథలు, సామాజిక, ఆర్థిక అంశాలపై చక్కని అవగాహన కల్పించే పుస్తకాలు మీ సొంతం చేసుకోండి. మీ బంధుమిత్రులకూ కానుకగా అందించండి. మీ ఊరి మస్జిదులలోనూ పుస్తకాలను ఉంచండి. నలుగురూ చదివితే మీకూ పుణ్యప్రదమే.

పుస్తకాలు చదవండి మీ జ్ఞానపరిధిని పెంచుకోండి
విశాల భావాన్ని అలవర్చుకోండి సంతోషంగా ఉండండి

**Bank Details:** TELUGU ISLAMIC PUBLICATIONS TRUST
Central Bank of India, Noorkhan Bazar Branch, Hyderabad
A/c. No. 1042789779 IFSC Code. CBIN0282407
మరిన్ని వివరాలకు సంప్రదించండి: 9700255736, 7660012481